
RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 238 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 24-3-2026 | Pages: 8 | Rs: 2/-
సంపుటి : 17 | సంచిక :238 | ఎడిటర్: కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 24-3-2026 | పేజీలు : 8 | రూ: 2/-

## పశ్చిమాసియాలో యుద్ధంతో భారత్‌కు సవాళ్లు: మోదీ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియాలో యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లను తీసుకొచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఉద్రిక్తతలపై నేడు ఆయన లోక్‌సభలో మాట్లాడారు. గల్ఫ్ దేశాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. యుద్ధ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు చెప్పారు. అక్కడ చిక్కుకొన్న భారతీయులను సురక్షితంగా తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఎల్పీజీ విషయంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. "పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను"

**హర్మూజ్‌ని దాటి భారత్ దిశగా రెండు ఎల్పీజీ నౌకలు**

"ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే

తరువాయి 2లో..


## గ్యాస్ సంక్షోభానికి చెక్...

# ఎల్పీజీకి బదులు పీఎన్జీ!

**సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**

**పంట నష్టంపై మార్చి 26లోగా నివేదిక**

**పాలనలో టెక్నాలజీ వినియోగంపై ప్రశంస**



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగంపై దృష్టి సారించడమే సరైన మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ అందించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం, టెక్నాలజీ వినియోగం వంటి అంశాలపై సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గ్యాస్ సంక్షోభాన్ని విద్యుత్ రంగానికి ఒక అవకాశంగా మలుచుకోవాలని, ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్ల వంటి వాటి వాడకాన్ని ప్రజల్లో ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణకు 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం 60 వేల మంది మాత్రమే వినియోగించుకుంటున్నారని అధికారులు వివరించగా.. దీనిని 100 శాతం వినియోగంలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి జిల్లాలో కనీసం 10 వేల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా లక్ష్యం నిర్దేశించారు. నిలిచిపోయిన శ్రీకాకుళం – కాకినాడ పైప్‌లైన్ పునరుద్ధరణ కోసం కేంద్ర మంత్రికి తక్షణమే లేఖ రాయాలని చెప్పారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు అవసరమైన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలన్నారు. వాణిజ్య రంగంలో సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 'నేచురల్ గ్యాస్ పాలసీ'ని వచ్చే కేబినెట్ సమావేశం ముందుకు తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యా సంస్థలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీలు, అన్న క్యాంటీన్లు, హోటళ్లకు ప్రాధాన్యతా క్రమంలో ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేయాలన్నారు. గత ఐదు రోజులుగా గృహావసరాలకు రోజుకు సగటున 1.80 లక్షల సిలిండర్లు పంపిణీ చేస్తున్నామని, మరో 14,444

తరువాయి 2లో..

## ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్...

**శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామి**



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లి జిల్లా నక్కపల్లి సమీపంలోని రాజయ్యపేటలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు నేటి సాయంత్రం భూమిపూజ నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఈ ప్లాంట్ కీలకం కానుంది. ఈ కార్యక్రమానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల


తరువాయి 2లో..

## రాష్ట్రంలో కొత్తగా 23,980 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులు

*ఏర్పాటుకు 20 ప్రాంతాల గుర్తింపు*

*పూర్తైన టీసీఎఫ్ఆర్*

*7,450 మెగావాట్ల ప్రాజెక్టుల కోసం ఎన్‌టీపీసీ ఒప్పందం*



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలో మరో 23,980 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులను (పీఎస్‌పీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం పలు జిల్లాల పరిధిలో 20 ప్రాంతాలను గుర్తించింది. ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ చేసిన అధ్యయనాల ఆధారంగా ఈ ప్రాంతాలను (లోకేషన్లు) నెడ్‌క్యాప్ గుర్తించింది. అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూముల ఆధారంగా లొకేషన్లను సంస్థ ఖరారు చేసింది. సాంకేతిక, వాణిజ్య ఫీజిబిలిటీ రిపోర్టును (టీసీఎఫ్ఆర్) నూతన పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్) సిద్ధం చేసింది. తర్వాత దశలో ప్రీ ఫీజిబిలిటీ నివేదికలు, డీపీఆర్‌లను నెడ్‌క్యాప్ తయారు చేయిస్తుంది. ఈ ప్రాజెక్టులు కేటాయించడం ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.1.20

తరువాయి 2లో..




## ఇరాన్ వార్నింగ్

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇరాన్‌లో అమెరికా భూతల దాడులకు దిగొచ్చని, ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనంలోకి తీసుకోవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి స్ట్రాంగ్ వార్నింగ్ వచ్చింది. తమ దేశ తీరం లేక ద్వీపాలపై దాడి చేస్తే.. పర్షియన్ గల్ఫ్ అంతటా సీమైన్స్ (సాముద్రిక మందుపాతరలు) పరుస్తామని తాజాగా ఇరాన్ డిఫెన్స్ కౌన్సిల్ హెచ్చరించింది. ఈ మేరకు రాయిటర్స్ కథనం పేర్కొంది. దాంతో గల్ఫ్ షిప్పింగ్ మార్గాలు, కమ్యూనికేషన్ లైన్లకు తీవ్ర అంతరాయం కలగొచ్చని పేర్కొంది. తమ తీరం నుంచే వాటిని జలాల్లోకి ప్రవేశపెట్టగలమని వెల్లడించింది. "దాంతో సుదీర్ఘకాలం గల్ఫ్ ప్రాంతమంతటా.. హర్మూజ్ జలసంధిలో నెలకొన్న

తరువాయి 2లో..

## ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకుందాం

**రాష్ట్రంలో పెద్దఎత్తున తాగునీటి ప్రాజెక్టుల పనులు**

**ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్**



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకుని భవిష్యత్తును కాపాడుకుందామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

తరువాయి 2లో..

## యువగళం హామీలు నిలబెట్టుకున్నా..

## శెట్టిబలిజలకు అండగా ఉంటా: మంత్రి లోకేశ్

*దొమ్మేటి జీవితం ఆదర్శం*

*యువగళం హామీలు నెరవేర్చా*

*వైసీపీ పాలనలో దాడులు..*

*మేం అండగా నిలిచాం*




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

శెట్టిబలిజల ఆరాధ్య దైవం, సంఘ సంస్కర్త దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలను, ముఖ్యంగా శెట్టిబలిజలను లక్ష్యంగా చేసుకుని వెంటపడి వేధించారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. విశాఖపట్నంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సభకు లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న ఆరు నెలల్లో బోడసకుర్రులో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, శెట్టిబలిజల కోసం రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామని కీలక ప్రకటన చేశారు.

**దొమ్మేటి జీవితం ఆదర్శం..:** దొమ్మేటి

తరువాయి 2లో..

## సొంత శకాన్ని సృష్టించుకున్నారు: షా



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రధాని మోదీ శకంతో అభివృద్ధి రంగంలో దేశం సరికొత్త ఘనతలు సాధిస్తూ సమూలంగా పరివర్తన చెందుతోందని కేంద్ర మంత్రులు అమిత్ షా, జె.పి.నడ్డా, పీయూష్ గోయల్,

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# బాబు బెంగాల్... పవన్ తమిళనాడు

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో రెండవ అతి పెద్ద మిత్ర పక్షంగా తెలుగుదేశం పార్టీ ఉంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు జాతీయ స్థాయి రాజకీయాల మీద పూర్తి అవగాహన ఉన్న వారు, ఎంతో మంది నేతలతో పరిచయం ఉన్న వారు. ఇక మరో వైపు చూస్తే బాబు జాతీయ స్థాయిలో అనేక రాష్ట్రాలలో గతంలో ప్రచారం నిర్వహించి ఉన్నారు. ప్రస్తుతం ఎన్డీయేకి కేంద్రంలో నాయకత్వం వహిస్తున్న బీజేపీ ఇపుడు మిత్రుల వైపు చూస్తోంది. దానికి కారణం దేశంలో నాలుగు రాష్ట్రాలు ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో బీజేపీ ప్రాధాన్యతలు కూడా ఉన్నాయి. అందుకే మిత్రులను ఈసారి గట్టిగా వాడుకోవాలని బీజేపీ నిర్ణయించింది అని అంటున్నారు. బీజేపీకి అస్సాం రాష్ట్రంలో మరోసారి గెలుపు మీద నమ్మకం ఉంది. అయితే బీజేపీకి మరో రెండు రాష్ట్రాల్లో గెలుపు అవసరం. అది జరిగితేనే బీజేపీకి జాతీయ స్థాయిలో ఎంతో ఉపశమనంగా ఉంటుంది. ఆ రెండు రాష్ట్రాలలో ఒకటి పశ్చిమ బెంగాల్ లోని తృణమూల్ కాంగ్రెస్ ని ఓడించడం, నిజానికి ఈ పనిని 2021 ఎన్నికల్లో బీజేపీ చేయాలని చూసింది కానీ సాధ్యపడలేదు, కానీ ఈసారి అది అయ్యేలా చూసుకుంటోంది. ఏ ఒక్క అవకాశాన్ని వదలడం లేదు. దాంతో టీడీపీ అధినేత ఏపీ ముఖ్యమంత్రి బాబుని పశ్చిమ బెంగాల్ కి పంపించడానికి బీజేపీ చూస్తోంది అని అంటున్నారు. ఆ విధంగా మమతకు చెక్ పెట్టాలని వ్యూహరచన చేస్తోంది అంటున్నారు. ఈ మేరకు బీజేపీ పావులు కదుపుతోందని అంటున్నారు. దాంతో బాబు తన ఎన్నికల ప్రచారాన్ని బెంగాల్ లో మూడు రోజుల పాటు చేస్తారు అని అంటున్నారు. ఇక తమిళనాడు బీజేపీకి చాలా కీలకమైనదిగా చెబుతున్నారు. అక్కడ డీఎంకే అధినేత ముఖ్యమంత్రి స్టాలిన్ ని ఈసారి ఓడించకపోతే రెండోసారి అధికారం చేపట్టి మరింతగా బలపడతారు. దాంతో ఇండియా కూటమి 2029 నాటికి బలంగా మారుతుంది. అందుకే తమిళనాడులో ఎన్డీయే కూటమి ప్రభుత్వం స్థాపించాలని బీజేపీ గట్టి పట్టుదల మీద ఉంది. ఈ క్రమంలో జనసేన అధినేత ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇమేజ్ ని ఆయన సినీ గ్లామర్ తో పాటు ఆయన ఫైర్ బ్రాండ్ స్పీచ్ ని వాడుకోవాలని చూస్తోంది అని అంటున్నారు. దాంతో జరుగుతున్న ప్రచారం బట్టి చూస్తే కనుక పవన్ తమిళనాడులో ఎన్డీయేకు మద్దతుగా కొన్ని రోజులు ప్రచారం చేస్తారు అని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న అంచనాలు చూస్తే నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అస్సాంలో బీజేపీకి విజయావకాశాలు ఉన్నాయని అంటున్నారు. అదే సమయంలో పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీకి చాన్స్ ఉందని, తమిళనాడులో స్టాలిన్ కి ఎడ్జ్ ఉందని అంటున్నారు. కేరళలో అయితే కాంగ్రెస్ అధికారం అందుకుంటుందని చెబుతున్నారు. పాండిచ్చేరిలోనే ఎన్డీయే మరోసారి అధికారంలోకి వస్తుందని అంటున్నారు. అంటే సేం టూ సేం సీఎన్ అలాగే ఉంటుందన్న మాట. దీనిని మార్చాలని తాము మరింతగా బలం పుంజుకోవాలని ఎన్డీయే పెద్దలు భావిస్తున్నారు. దాంతో వారు మిత్రులను కూడా ప్రచారం కోసం రంగంలోకి దింపుతున్నారు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## గ్యాస్ సంక్షోభానికి చెక్...

# ఎల్పీజీకి బదులు పీఎన్జీ!

మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు.

**పంట నష్టంపై మార్చి 26లోగా నివేదిక**

అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో జరిగిన పంట నష్టంపై ప్రాథమిక వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 26వ తేదీలోగా పంట నష్టంపై పూర్తిస్థాయి అంచనాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో జీఎస్‌డీపీ 40 శాతం, ఉత్పాదన 71 శాతం పెరిగిన నేపథ్యంలో పంటల నిర్వహణ, పంటల మార్పిడిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**పాలనలో టెక్నాలజీ వినియోగంపై ప్రశంస**

టెక్నాలజీ వినియోగంతో అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని, దీనికి తిరుమలలో పెరిగిన దర్శనాల సంఖ్యే నిదర్శనమని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో తిరుమలలో క్యూలైన్ల నిర్వహణ మెరుగుపడిందని, భక్తుల నిరీక్షణ సమయం తగ్గి దాదాపు 20 శాతం అదనపు దర్శనాలు సాధ్యమయ్యాయని వివరించారు. అత్యాధునిక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుతో ప్రసాదం నాణ్యత పెరిగిందని, భక్తులు, శ్రీవారి సేవకుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన శాఖలు కూడా మెరుగైన ప్రజా సేవల కోసం ఏఐ ఇంటిగ్రేషన్‌పై దృష్టి సారించాలని ఆదేశించారు. ఐఓటీ పరికరాలు, సెన్సార్లు, సీసీటీవీల ద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో సాగు వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెంచేలా చూడాలని, ఇందుకు పొరుగు రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ పెంచాలని, ప్రభుత్వ శాఖలు డేటాను సమర్థంగా వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కొత్తగా 23,980 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులు

లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంటుంది. ఐదు లొకేషన్లలో ప్రతిపాదించిన 7,450 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎన్టీపీసీ ఇప్పటికే ఎంవోయూ కుదుర్చుకుంది. దీంతో ఇప్పటికే వివిధ సంస్థలకు కేటాయించిన 31,800 మెగావాట్లతో కలిపి..మొత్తంగా 55,750 మెగావాట్ల పీఎస్‌పీ ప్రాజెక్టులు రాష్ట్రంలో ఏర్పాటు కానున్నాయి.

**6 జిల్లాల్లో కొత్త లొకేషన్లు**

ప్రకాశం జిల్లాలో 1,650 మెగావాట్లు, ఏఎస్ఆర్ జిల్లాలో 12 లొకేషన్లలో 17,150 మెగావాట్లు, పార్వతీపురం మన్యంలో 3 లొకేషన్లలో 2,050 మెగావాట్లు, వైఎస్సార్ కడపలో 2 లొకేషన్లలో 2,000 మెగావాట్లు, తిరుపతిలో 1,000 మెగావాట్లు, నంద్యాలలో 180 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. రాష్ట్రంలో 21,153 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉన్న విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిలో సుమారు 8 వేల మెగావాట్ల ప్రాజెక్టులు సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి సంబంధించినవి. అయితే గ్రిడ్ నిర్వహణలో ఇబ్బందులు.. భవిష్యత్ విద్యుత్ అవసరాల దృష్ట్యా పీఎస్‌పీ ప్రాజెక్టులను సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో 23 లొకేషన్లలో..31,900 మెగావాట్ల పీఎస్‌పీ ప్రాజెక్టులను వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయించింది. వాటిని పూర్తి చేయడంపై అధికారులు దృష్టి పెట్టారు. 2,600 మెగావాట్ల సామర్థ్యంగల మూడు పీఎస్‌పీ ప్రాజెక్టులను దక్కించుకున్న సంస్థలు వివిధ కారణాలతో పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపలేదు. ఈ కారణంగా వాటి డీపీఆర్‌ల తయారీని నెడ్‌క్యాప్ నిలిపేసింది. మిగిలిన 29,300 మెగావాట్ల పీఎస్‌పీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థలు రూ.1,64,955 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నాయి.

**డీపీఆర్‌లు నిలిపేసిన ప్రాజెక్టులు**

శిరిడీసాయి ఎలక్ట్రికల్స్‌కు వైఎస్సార్ కడప జిల్లాలో కేటాయించిన 900 మెగావాట్ల ప్రాజెక్టు, ఏఎస్ఆర్ జిల్లా ఎర్రవరంలో 1,200 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతంలో అటవీ భూములు ఉండటం, గిరిజన ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలతో డీపీఆర్‌లను నిలిపేసింది. జేఎస్‌డబ్ల్యూ సంస్థకు వైఎస్సార్ కడప జిల్లాలో వేంపల్లి దగ్గర కేటాయించిన 500 మెగావాట్ల ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతంలో అటవీ భూములు ఉండటంతో అనుమతులు రావడం కష్టం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు క్యాప్టివ్ అవసరాల కోసం వైఎస్సార్ కడప జిల్లాలో పైడిపాలెం నార్త్, పైడిపాలెం తూర్పు దగ్గర ప్రతిపాదించిన 3,500 మెగావాట్ల సౌర, 1,500 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు డెవలపర్ ఆసక్తి చూపడం లేదు.

## యువగళం హామీలు నిలబెట్టుకున్నా..

# శెట్టిబలిజలకు అండగా ఉంటా: మంత్రి లోకేశ్

వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం గర్వంగా ఉందని లోకేశ్ అన్నారు. "బ్రిటిష్ పాలనలో బర్మా వలస వెళ్లిన శెట్టిబలిజలలో దొమ్మేటి ఒకరు. సాధారణ వ్యక్తిగా వెళ్లి, షిప్పింగ్ వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదిగి షిప్‌లకు ఓనర్ అయ్యారు. ఆ తర్వాత బర్మాకు మేయర్‌గా సేవలు అందించారు. అక్కడి శెట్టిబలిజల కష్టాలు చూసి, వారిలో చైతన్యం నింపేందుకు శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. విద్య విలువను గుర్తించి పిల్లల కోసం స్కూళ్లు, నైట్ స్కూళ్లు ప్రారంభించారు. ఆ తర్వాత జన్మభూమికి తిరిగివచ్చి బోడసకుర్రు జమీందార్‌గా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడమే కాక, స్కూళ్లు, కాలేజీలు, లైబ్రరీల కోసం తన సొంత భూములు, నిధులు విరాళంగా ఇచ్చారు" అని ఆయన స్మరించుకున్నారు.

**యువగళం హామీలు నెరవేర్చా ..:** యువగళం పాదయాత్రలో శెట్టిబలిజ సోదరులు తనను కలిసి దొమ్మేటి జయంతిని ప్రభుత్వ పండుగగా చేయాలని కోరారని, ప్రజా ప్రభుత్వం రాగానే ఆ మాట నిలబెట్టుకున్నానని లోకేశ్ తెలిపారు. పాదయాత్ర సమయంలోనే దొమ్మేటి గొప్పతనం పూర్తిగా తెలుసుకున్నానని, మద్యం షాపుల్లో 10 శాతం శెట్టిబలిజలకు కేటాయిస్తామన్న హామీని కూడా నెరవేర్చామని గుర్తుచేశారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం కల్లుగీత ఫెడరేషన్, ఆదరణ పథకాలతో కార్మికులను ఆదుకుంటే, 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం 'జె-బ్రాండ్స్'తో వారి జీవితాలను దెబ్బతీసిందని విమర్శించారు.

**వైసీపీ పాలనలో దాడులు.. మేం అండగా నిలిచాం**

"గత ఐదేళ్లలో బీసీలపై వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించింది. తన అక్కను ఎందుకు వేధిస్తున్నావని అడిగినందుకు అమర్నాథ్ గౌడ్ అనే కుర్రాడిపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. పల్నాడులో తమకు జై కొట్టలేదని తోట చంద్రయ్యను కిరాతకంగా చంపేశారు. ప్రొద్దుటూరులో నందం సుబ్బయ్యను హతమార్చారు. మేం ఆ బాధితుల కుటుంబాలకు అండగా నిలిచాం. నందం సుబ్బయ్య బిడ్డలను, అమర్నాథ్ గౌడ్ సోదరిని చదివిస్తున్నాం. తోట చంద్రయ్య బిడ్డకు పది రోజుల్లో ఉద్యోగం ఇస్తాం" అని లోకేశ్ భరోసా ఇచ్చారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారని అన్నారు. బోడసకుర్రు బ్రిడ్జికి దొమ్మేటి వెంకటరెడ్డి పేరు పెట్టే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. చెట్టు పైనుంచి పడిన గీత కార్మికులను ఆదుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ముతుకుమిల్లి భరత్, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణ బాబు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

### దురాక్రమణకు దిగితే.. పర్షియన్ గల్ఫ్ అంతా సీమైన్స్

పరిస్థితే ఉంటుంది. 1980ల్లో స్వల్ప సంఖ్యలో పరిచిన సీమైన్స్‌ను తొలగించడానికి 100 మైన్ స్వీపర్లు ప్రయత్నించి విఫలమైన సంగతిని మర్చిపోకూడదు" అని ఇరాన్ తన ప్రకటనలో శత్రుదేశాలకు గుర్తుచేసింది. ఇరాన్ చమురు ఎగుమతులకు ఖర్గ్ ఐలాండ్ అత్యంత కీలకమైనది. హర్మూజ్‌ను తెరిచే విషయంలో ఆ దేశంపై ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఆక్రమించాలని యూఎస్ (ఖూూ) యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దానికి తగ్గట్టే 4500 మంది సెయిలర్లు, మెరైన్లను మోహరించింది. హెలికాప్టర్లు, ఎఫ్-35 ఫైటర్ జెట్స్, సాయుధ ల్యాండింగ్ వెహికిల్స్‌లో కూడిన బెటాలియన్‌ను కూడా పంపింది. అయితే ఈ మోహరింపు హర్మూజ్‌ను తెరవడానికా లేక ఖర్గ్ స్వాధీనానికి అనే దానిపై మాత్రం స్పష్టత లేదు.

### ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్... శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామి

శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఆర్సెలార్ మిట్టల్ అధినేత లక్ష్మీ మిట్టల్, కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం వారు శిలాఫలకం ఆవిష్కరించారు. అంతకుముందు, స్టీల్ ప్లాంట్ నిర్మాణ నమూనాను లక్ష్మీ మిట్టల్.. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి కుమారస్వామికి వివరించారు. అనంతరం, నేతలందరూ ప్లాంట్ స్థలంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించారు. రాజయ్యపేటలో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిర్మాణ పనులు పూర్తి చేసి 2029 నుంచి ఉత్పత్తిని ప్రారంభించాలని కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ భారీ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చగలదని అంచనా వేస్తున్నారు. దీనిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

### ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకుందాం

పిలుపునిచ్చారు. నీటి ప్రాముఖ్యతను గుర్తించి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. నీటి ప్రాధాన్యాన్ని తెలియజెబుతూ జలజీవన్ మిషన్, ఉపాధి హామీ పథకాల కింద రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలు, తాగునీటి ప్రాజెక్టుల పనులను వివరించారు. 'గత 20 నెలల్లో ఒక టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం గల 1,06,788 వ్యవసాయ కుంటలు, 13,500 పశువుల తొట్టెలను నిర్మించాం. 1.46 కోట్ల జనాభాకు లబ్ధి చేకూరేలా రూ.9,441 కోట్లతో 8 మల్టీ విలేజ్ నీటి పథకాల పనులు చేపట్టాం. రూ.9,355 కోట్లతో త్వరలో మరో ఏడు మల్టీ విలేజ్ పథకాల పనులు ప్రారంభం కానున్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న మరో 3 వేల గ్రామాల్లో 38.54 లక్షల జనాభాకు లబ్ధి చేకూరేలా రూ.1,814.71 కోట్లతో పనులు చేపట్టనున్నాం' అని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### సొంత శకాన్ని సృష్టించుకున్నారు: షా

అశ్వినీ వైష్ణవ్, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ తదితరులు సామాజిక మాధ్యమాల్లో శ్లాఘించారు. దశాబ్దాలుగా అందిస్తున్న సేవలతో మోదీ తనకంటూ ఒక సొంత శకాన్ని సృష్టించుకున్నారని షా చెప్పారు. ఇలాంటి సరికొత్త భారతావనిని తీర్చిదిద్దాలంటే జీవితకాల కృషి అవసరమని, మోదీ అదే చేశారని వివరించారు. ఎలాంటి సెలవు లేకుండా సుమారు 24 ఏళ్లుగా ప్రభుత్వాధినేతగా సేవలు అందించడం ఆయన సంకల్పశుద్ధికి నిదర్శనమన్నారు. "మోదీ మూడుసార్లు గుజరాత్ సీఎంగా ఉన్నారు. మూడుసార్లు దేశానికి ప్రధాని అయ్యారు. ఆయనపై ప్రజల్లో విశ్వాసం, ఆదరణ, మద్దతు రోజురోజుకీ పెరుగుతూనే ఉన్నాయి. సేవ, కఠిన శ్రమ, అంకితభావం అనే బలమైన వేర్లతో ఆయన వీటిని సాధిస్తున్నారు. ఇదొక అరుదైన గౌరవం.. అసమాన సేవ" అని పొగడ్తలు కురిపించారు. వికసిత భారత్ సాధన ధ్యేయంగా.. పేదలు, యువత, మహిళలు, రైతుల సాధికారత కోసం ఒక దార్శనికతతో మోదీ పనిచేస్తున్నారని నడ్డా చెప్పారు. దానివల్ల ప్రపంచ దేశాల్లో భారత్ ఎంతో ఆత్మవిశ్వాసంతో ప్రాభవాన్ని చాటుకుంటోందన్నారు.

# పశ్చిమాసియాలో యుద్ధంతో భారత్‌కు సవాళ్లు: మోదీ

10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉంది"

**ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం..**

"దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నాం" "ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం" అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో 96 వినతులు

## - జివిఎంసి అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 23:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 96 వినతులు వచ్చాయని జివిఎంసి అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరం లో అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 96 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా మధురవాడ జోన్ కు 13, ఈస్ట్ జోన్ కు 09, వెస్ట్ జోన్ కు 04, నార్ట్ జోనుకు 18, సౌత్ జోన్ కు 15, పెందుర్తి జోన్ కు 10, అగనంపూడి జోన్ కు 03, గాజువాక జోన్ కు 17, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 07 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ ఢ అకౌంట్సు విభాగమునకు 03, రెవెన్యూ విభాగమునకు 13, ప్రజారోగ్య విభాగమునకు 05, పట్టణ ప్రణాళిక విభాగమునకు 60, ఇంజినీరింగు విభాగమునకు 14, మొక్కల విభాగమునకు 01 కలిపి మొత్తంగా 96 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం అదనపు కమిషనర్లు మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు ఆదర్శనీయం

### దొమ్మేటి జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 23**
మహాత్మా గాంధీ కంటే ముందే వయోజన విద్య ప్రాముఖ్యతను గుర్తించి వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి విశేషంగా కృషి చేశారని, సమాజ సేవలో ఆయన ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం దొమ్మేటి జయంతి సందర్భంగా కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్ సమాజంలో విద్యా విస్తరణ, సామాజిక సమానత్వం కోసం వెంకటరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం, సామాజిక న్యాయం సాధన కోసం ఆయన చేసిన అలుపెరగని పోరాటం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు, బీసీ వెల్ఫేర్ అధికారిణి రాజేశ్వరి, ప్రత్యేక ఉప కలెక్టర్ మధుసూదన్, కలెక్టేరేట్ ఏవో బీవీ రాణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ఆల్ ఇండియా ఫిజికల్లి డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్

### ఛాంపియన్‌షిప్- 2026 ఘనంగా ప్రారంభం




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 23:**
ఆల్ ఇండియా ఫిజికల్లి డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్--2026 సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో దేశం నలుమూలల నుంచి ఐదు జోన్ల జట్లు పాల్గొంటున్నాయి. ఈ పోటీలను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సంపూర్ణ సహకారంతో డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తోంది. ఏసీఏ డిఫరెంట్లీ ఏబుల్ కమిటీ చైర్మన్ సురవరపు రామన్ సుబ్బారావు, సభ్యుడు మరియు సెక్రటరీ యడ్లపల్లి సూర్యనారాయణ ఆధ్వర్యంలో టోర్నమెంట్ కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీఏ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్. కుమార్ హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ప్రత్యేక అతిథిగా ఏసీఏ--వీడీసీఏ స్టేడియం మేనేజర్ జె.కే.ఎం. రాజు పాల్గొన్నారు. ముందుగా టోర్నమెంట్ ట్రోఫీని మరియు జట్ల జెర్సీలను ఎం.ఎస్. కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఏసీఏ అధ్యక్షులు కేశినేని శివనాథ్ మరియు సెక్రటరీ సానా సతీష్ బాబు దివ్యాంగ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఇలాంటి టోర్నమెంట్‌లకు ఎల్లప్పుడూ మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో భారత దివ్యాంగ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ గురుదాస్ రౌత్, మాజీ భారత దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుడు ఉత్పల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుసూదన్ నాయక్, అడ్వైసర్ రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ లో నార్త్ జోన్ మొదట బాటింగ్ 15 ఓవర్లకు 186 పరుగులు చేసి, 8 వికెట్లను కోల్పోయింది. లక్ష్య చేదనకు దిగిన సౌత్ జోన్ చివరి దాకా పోరాడి 15 ఓవర్లు ముగిసే సరికి 168 పరుగులకు 6 వికెట్లు కోల్పోయి ఓటమి పాలయ్యింది. మాన్ అఫ్ ది మ్యాచ్ చొక్కర్ దక్కించుకున్నారు. రెండవ మ్యాచ్ సెంట్రల్ జోన్ 15 ఓవర్లకు 252 పరుగులు చేసి 7వికెట్లు కోల్పోయింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్ట్ జోన్ 95 పరుగులకే అల్ అవుట్ అయ్యింది. ఈ మ్యాచ్ లో మాన్ అఫ్ ది మ్యాచ్ యోగేందర్ కి దక్కింది.

# స్వామివారికి ముత్యాల తలంబ్రాల సమర్పణ



**సింహాచలం, సిటిజన్ టైమ్స్, మార్చి 23**
దక్షిణ భారతదేశంలోనే అత్యంత మహిమాన్వితమైన పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న సింహాచల క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోంది. ఈ నెల 29 వ తేదీన లోకకల్యాణం కోసం జరగనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవానికి అంకురార్పణ జరుగుతున్న వేళ, క్షేత్రంలో భక్తి పారవశ్యం నెలకొంది. స్వామివారి కళ్యాణ క్రతువులో అత్యంత ప్రధానమైన ఘట్టం తలంబ్రాల వేడుక. ఈ మహత్తర కార్యానికి కావలసిన ముత్యాలను విజయలక్ష్మి డైమండ్స్ అధినేత వి. శివశంకర్ రాజు మరియు వారి కుటుంబ సభ్యులు (నవరత్న జ్యువెల్ స్టేర్, ద్వారకానగర్, విశాఖపట్నం) సోమవారం స్వామివారికి భక్తిపూర్వక కానుకగా సమర్పించారు. శివశంకర్ రాజు తమ కుటుంబ సభ్యులతో కలిసి, ముత్యాల తలంబ్రాలను శిరస్సున ధరించి స్వామివారి బేడా మండపంలో ప్రదక్షిణలు నిర్వహించారు. గోవింద నామస్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. సుమారు 5 కిలోల మేలిరకపు ముత్యాలను ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావుకి స్వామివారి కైంకర్యం నిమిత్తం అందజేశారు. అనంతరం ఆలయ వేద పండితులు వారికి వేద మంత్రోచ్ఛారణలతో 'ఆశీర్వచనం' అందజేశారు. ఆలయ అధికారులు వారిని శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. స్వామివారి సేవలో భాగస్వాములైన శివశంకర్ రాజు కుటుంబ సభ్యుల భక్తిని ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ప్రత్యేకంగా అభినందించారు. స్వామివారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. సింహగిరి కలియుగ ప్రత్యక్ష దైవం ఆ నృసింహ దేవుని కళ్యాణోత్సవం వీక్షించడం జన్మధన్యమని భక్తులు విశ్వసిస్తారు. ఈ ముత్యాల తలంబ్రాలతో జరగనున్న స్వామివారి కళ్యాణ వేడుకకు భక్తజనకోటిని ఆలయ కార్య నిర్వహణాధికారి ఆహ్వానిస్తున్నారు.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్

### దక్షిణ వైసిపి ముస్లిం నేతలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన వాసుపల్లి

### ఇంటికి వెళ్లి స్వీట్లు అందజేసి సత్కరించిన మాజీ ఎమ్మెల్యే




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 23:**
మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ దక్షిణ వైఎస్ఆర్సిపి ముస్లిం నాయకులు రాష్ట్ర మాజీ డైరెక్టర్ షబీదా బేగం, 39 వ వార్డు అధ్యక్షులు ముజీబ్ ఖాన్ ఇంటికి వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. స్వీట్ బాక్సులు అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అల్లా ఆశీస్సులతో మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. ఆయన సేవలు రాష్ట్రానికి అవసరమన్నారు. ముస్లింలకు సముచిత స్థానం కల్పించింది వైఎస్సార్సీపీ ప్రభుత్వమేనని వాసుపల్లి స్పష్టం చేశారు. రంజాన్ మాసంలో నిర్వహించే 'ఇఫ్తార్' విందులు మత సామరస్యానికి వేదికలుగా నిలుస్తున్నాయనీ మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అందరూ ఒకే చోట చేరి విందు ఆరగించడం ద్వారా సోదరభావం వెల్లివిరుస్తుందన్నారు. ఇక నమాజ్లో నిర్వహించే తక్బీర్, రకాత్, రుకూ, సజ్దా వంటి వివిధ క్రియలు కేవలం ప్రార్థనలే కాకుండా, శరీరానికి మేలు చేసే వ్యాయామాలుగా కూడా ఉపయోగపడతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయనీ వాసుపల్లి తెలిపారు. క్రమం తప్పకుండా నమాజ్ చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం కూడా సిద్ధిస్తుంది. ఇలా ఆధ్యాత్మికత, సేవాగుణం ఆరోగ్య సూత్రాల సమ్మేళనంగా రంజాన్ మాసం విశిష్టతను చాటుకుంటోందన్నారు. మరోసారి ముస్లిం సోదరులందరికీ వాసుపల్లి గణేష్ కుమార్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రపంచ వాతావరణ దినోత్సవంను జయప్రదం చేయండి

- తీరప్రాంతంలో రక్షణ వనాలు పెంచాలి - భూమికి పూర్వపు శోభను తీసుకు వద్దాం

- విస్తారంగా సామాజిక వనాలు పెంచాలి - జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 23**
ప్రపంచ వాతావరణ దినోత్సవం ను జయప్రదం చేయండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం అన్నమయ్య జిల్లా వీరెల్లి మండలం , రెడ్డి వారి పల్లి లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కోర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం జిల్లా సమన్వయ కర్త శివ లక్ష్మి అధ్యక్షతన ప్రకృతి కార్యశాల నిర్వహించడం జరిగింది. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలో రక్షణ వనాలు పెంచాలని కోరారు. ఇందుకుగాను ప్రధానంగా సరుగుడు, మొగలి, తీరం లో పెరిగే గడ్డి, మోర్నింగ్ గ్లోరి తదితర మైన మొక్కలు నాటి పెంచాలి అని కోరారు. భూమికి పూర్వపు శోభను తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విస్తారంగా సామాజిక వనాలు పెంచాలని కోరారు. ఇందుకుగాను ప్రభుత్వం తో పాటు పారిశ్రామిక వర్గాలు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా సమన్వయ కర్త శివ లక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ వాతావరణ దినోత్సవం గురించి మాట్లాడుతూ నేటి వాతావరణ పరిశీలనలు (డేటా) భవిష్యత్తు తరాలను రక్షించడంలో ఎలా సహాయపడతాయో తెలియజేయడం అవసరం అన్నారు. ఉపగ్రహాలు, రాడార్ వ్యవస్థలు, వాతావరణ కేంద్రాల వంటి సాంకేతికత ద్వారా ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం అవసరం అని వివరించారు. ప్రతి సంవత్సరం మార్చి 23న వరల్డ్ మెటీరియలాజికల్ ఆర్గనైజేషన్ దీనిని నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా జె వి రత్నం పిచ్చుకల పరిరక్షణ కోసం గూళ్ళు విద్యార్థుల చేత తయారు చేయించడం, పశుపక్ష్యాదుల కోసం వ్యర్థాలు తో నీళ్ళు ఏర్పాటు చేయడం కోసం పాత్రలు తయారు చేయడం మీద శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పో మధుసూదన రాజు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# నైబర్‌హుడ్ వర్క్‌స్పేస్ కేంద్రాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం

## ఆసక్తి గల వారు ముందుకు రావాలి: జిల్లా కలెక్టర్ పిలుపు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 23**
జిల్లాలో నైబర్‌హుడ్ వర్క్‌స్పేస్ ( కేంద్రాల ఏర్పాటుకు ఆసక్తి గల అప్లికేంట్స్ /సంస్థలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసు కోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్.డబ్ల్యూ.ఎస్. పాలసీ 2025-30 అమలులో భాగంగా జిల్లాలో ఈ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో అర్హత గల సంస్థల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అభ్యర్థులు తమ వర్క్‌స్పేస్ వివరాలను అధికారిక వెబ్‌సైట్లు ఇన్వెస్టాంధ్ర .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ .ఏపీటీఎస్ .గవర్నమెంట్ .ఇన్ లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ పాలసీ ప్రకారంఎన్ ఎన్ డబ్ల్యు ఎస్ కేంద్రాల ఏర్పాటుకు రెండు వర్గాలను గుర్తించినట్లు వివరించారు. వర్గం 'ఎ' కింద ప్రభుత్వ భవనాలు, వర్గం 'బి' కింద ప్రైవేట్ భవనాలు ఉంటాయన్నారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కలిగిన ప్రభుత్వ భవనాలను ఎంపిక చేసి, అర్హత గల సంస్థలకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భవనాల్లో కేంద్రాల ఏర్పాటుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని స్థలాల గుర్తింపు, అనుమతుల మంజూరు వంటి ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. ఇదే సమయంలో ప్రైవేట్ రంగం నుంచి కూడా భాగస్వామ్యం పెరగాలని ఆకాంక్షించారు. జిల్లాలో ఐటీ రంగ అభివృద్ధి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్థానిక ఉపాధి అవకాశాల పెంపునకు ఈ ఎన్.డబ్ల్యూ.ఎస్. కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల అర్హత గల సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని దరఖాస్తులు సమర్పించాలని పిలుపునిచ్చారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించిన కేంద్ర మంత్రులు

## స్టీల్ ప్లాంట్ పూర్వవైభవానికి కేంద్రం సహకారం: కేంద్ర మంత్రి కుమారస్వామి

## 2030 నాటికి 300 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యం

## గత మూడు నెలలుగా లాభాల బాటలో విశాఖ ఉక్కు: కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ







**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 23**

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సోమవారం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను (=×చీూ) సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లోని వివిధ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ప్లాంట్ పురోగతిపై ఉన్నతాధికారులతో కలిసి వారు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మొదట పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులు ప్లాంట్‌లోని కోక్ ఓవెన్ యూనిట్‌ను సందర్శించి ఉత్పత్తి ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లాంట్ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా 27 జూన్ 2025న తిరిగి ప్రారంభించిన బ్లాస్ట్ ఫర్నేస్-3 (దీఫ్-3) కార్యకలాపాలను నిశితంగా పరిశీలించారు. ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడంలో ఈ విభాగం పోషిస్తున్న కీలక పాత్రను అధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్లాంట్ నూతన సీఎండీ (జవీణ) మనీష్ రాజ్ గుప్తా మంత్రులకు స్వాగతం పలికారు. ప్లాంట్ యొక్క ప్రస్తుత ఉత్పత్తి స్థితిగతులు, సాధిస్తున్న పురోగతి మరియు భవిష్యత్తు లక్ష్యాల గురించి ఆయన సమగ్రమైన ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కుమారస్వామి మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ప్లాంట్‌ను మరింత పటిష్టం చేసేందుకు అవసరమైన చర్యలను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్లాంట్ చరిత్రలో 20 నెలల వ్యవధిలో కేంద్ర ఉక్కుశాఖ మంత్రి రెండు సార్లు సందర్శించటం ఇదే తొలిసారి అన్నారు. నష్టాల ఊబిలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడమే కాకుండా, దానికి ఇస్తున్న ప్రత్యేక ప్రాధాన్యతకు ఈ పర్యటనలే నిదర్శనం అన్నారు. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ విజన్, సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు హెచ్.డి. కుమారస్వామి, నిర్మలా సీతారామన్ సహకారంతో కేంద్రం అందించిన ప్యాకేజీ ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి అని గత మూడు నెలలుగా స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో పయనించడం శుభపరిణామం అన్నారు. ప్రధాని మోదీ 2030 నాటికి దేశంలో ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నుల (మీ) కు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించాలన్నారు. ఈ లక్ష్య సాధనలో విశాఖ ఉక్కు పాత్ర కీలకం అని రాబోయే రోజుల్లో ప్లాంట్‌ను మరింత లాభాల్లోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులు, కార్మికులపై ఉందని ఆయన పేర్కొన్నారు. ?కార్మికుల సంక్షేమానికి సంబంధించి తగిన చర్యలు తీసుకుంటామని ప్లాంట్‌ను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రులు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ మతికుమల్లి శ్రీ భరత్, బిజెపి జిల్లా అధ్యక్షులు పరశురామరాజు ,ప్లాంట్ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# వైజాగ్‌కు తలమానికంలా జగనన్న తెచ్చిన ఇనార్బిట్ మాల్!

-విశాఖను గ్లోబల్ సిటీగా మార్చాలనే సంకల్పంతో మాల్‌కు 2023లో జగనన్న అనుమతులు

-షాపింగ్, డైనింగ్, ఎంటర్‌టైన్‌మెంట్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలవబోతున్న మాల్

వై.యస్.ఆర్.సి.పి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు ..




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 23**

విశాఖపట్నం జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు కె.కె రాజు మాట్లాడుతూ..ఈరోజు విశాఖలో ఇనార్బిట్ మాల్ రావడానికి ప్రధాన కారణం వై.యస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యంగా గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ లో మార్గదర్శమైన ఒక మార్గాన్ని సూచించడంలో ముందడుగు వేసి విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం సాలగ్రామపురంలో 17 ఎకరాల భారీ విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయి ఇనార్బిట్ మాల్ తీసుకురావడం జరిగిందని అన్నారు. ఈరోజు ప్రారంభమైన ఇనార్బిట్ మాల్ ఒక పెట్టుబడి మాత్రమే కాకుండా విశాఖకు తలమానికంగా మారిందని అన్నారు. ఇనార్బిట్ మాల్ ద్వారా చిన్న తరహా పరిశ్రమలు, టూరిజం, వినోదాత్మకమైనటువంటి గేమ్ ఛేంజర్ గా మారిందని అన్నారు.ఈరోజు ప్రారంభమైన ఇనార్బిట్ మాల్.. క్రెడిట్ కోసం చంద్రబాబు నాయుడు నానా తంటాలు పడుతున్నారని అన్నారు.

# మార్చి ఆఖరు నాటికి ఓటర్ల జాబితా మ్యాపింగ్ పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్




**విశాఖపట్టణం, సిటిజన్ టైమ్స్, మార్చి 23**

మార్చి నెల ఆఖరు నాటికి జిల్లాలోని ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ నెల నుంచి జన గణన -2027 ప్రక్రియ మొదలవుతుందని, ఈ లోగా ఓటర్ల జాబితాలకు సంబంధించిన పనులను పూర్తి చేసుకోవాలని చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు కింది స్థాయి అధికారులతో, సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని ప్రక్రయను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తోటని మర్యాదపూర్వకంగా కలిసిన ఒంటెద్దు వెంకన్న నాయుడు



**మండపేట సిటిజన్ టైమ్స్ మార్చి23**

మండపేట వైస్సార్సీపీ పరిశీలకులుగా నియమించబడిన పార్టీ కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు సోమవారం మండపేట నియోజకవర్గం కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ని మర్యాదపూర్వకంగా కలిసారు.

# వెల్లలో మెగా వైద్యద్య శిబిరం




**రామచంద్రపురం/ ద్రాక్షారామ సిటిజన్ టైమ్స్ మార్చి 23**

అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వారి సౌజన్యం తో వెల్ల పశు వైద్య అధికారి డాక్టర్ అనిల్ విల్సన్ ఆధ్వర్యం లో మెగా పశు వైద్య సిబిరం ను వాసంశెట్టి సత్యం మార్కెట్ కమిటీచైర్మన్ అక్కల రిష్వత్ రాయ్ జనసేన ఇంచార్జి పొలిశెట్టి చంద్రశేఖర్ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో 65 మంది పడి రైతులు 106 మంది పడి రైతులు పంపిణి చేసారు ఈ కార్యక్రమం లో రామచంద్రపురం అసిస్టెంట్ డైరెక్టర్డాక్టర్ ఓ రామకృష్ణ అధర్వరంలో 15 వేలు రూపయల మండులు మినరల్మిక్సర్ కాల్షియం పంపిని చేసారు. చెల్లూరు డా "విజయ్ ద్రాక్షారామ డా "కృష్ణార్జునుడుచూడు పరీక్షలు గర్భకోస పరీక్షలు నిర్వహించారుఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొమ్మిరెడ్డి కోదండరాం ఎమ్‌పీటీసీ చిక్కాల స్వామి మరియు. మంచం దేవి గ్రామ కమిటీ పెద్దలు ఆకుల నారాయణరావు వట్టికూటి ఏసుబాబు వట్టికూటి సురేష్ ఆకుల సతీష్ మార్కెట్ కమిటీ బోర్డు డైరెక్టర్ జె. గన్నిరాజు మార్కెట్ కమిటీ సభ్యులు పడి రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు క్షయ వ్యాధి నివారణ దినోత్సవం

**ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్ నుంచి ర్యాలీ నిర్వహణ**

**కాకినాడ రిపోర్టర్ సిటిజన్ టైమ్స్ మార్చ్ 23**

ఈ నెల 24వ తేదీ ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.జె.నరసింహనాయక్, మరియు జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి ఎస్.చల్లమయ్య సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నిర్మూలిస్తాం . అనే నినాదం తో ఈ నెల 24వ తేదీ మంగళవారం ఉదయం 9.30 గంటలకు జిల్లా కలెక్టరేట్ నుండి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ కాకినాడ జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా పరిషత్ సర్కిల్ వరకు నిర్వహించే ర్యాలీలో జిల్లా అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

# ఎల్పీజీ నుంచి పీఎన్జీకి మారేలా యాక్షన్ ప్లాన్

## శ్రీకాకుళం-కాకినాడ పైప్ లైన్ పునరుద్ధరణకు చర్యలు

## ఈ నెల 26వ తేదీ కల్లా పంట నష్టంపై నివేదిక ఇవ్వండి

## ఏఐ ఇంటిగ్రేషన్‌తో మెరుగైన ప్రజా సేవలకు ఆస్కారం

## ఆర్టీజీఎస్ సమీక్షలో అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి:( సిటిజన్ టైమ్స్ ): మార్చి:23**

ప్రస్తుతం ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మళ్లడమే సరైన పరిష్కారమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దీనికి పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ), విద్యుత్ పరికరాల వినియోగం పెరిగేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటికీ పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాలతో తలెత్తిన పంట నష్టంపై సోమవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణ కోసం 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ 60 వేల మంది వినియోగదారులు మాత్రమే కనెక్షన్లు పొందారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అయితే దీనిని 100 శాతం వినియోగించుకునేలా చూడటంతో పాటు, జిల్లాకు కనీసం 10 వేలకు తగ్గకుండా నూతన కనెక్షన్లు ఇవ్వాలంటూ సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. శ్రీకాకుళం - కాకినాడ పైప్ లైన్ పునరుద్ధరణపై కేంద్ర మంత్రికి లేఖ రాయాలని చెప్పారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్‌కు వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వచ్చే కేబినెట్ సమావేశానికి 'నేచురల్ గ్యాస్ పాలసీ ఫర్ ప్రమోషన్ ఇన్ కమర్షియల్ సెక్టార్' విధానాన్ని తీసుకురావాలని చెప్పారు. గ్యాస్ సంక్షోభం విద్యుత్ రంగానికి ఒక అవకాశమని, ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు వంటివి ప్రత్యామ్నాయ వనరుగా వినియోగించేలా చూడాలన్నారు. విద్యా సంస్థలకు, ఆస్పత్రులు, అంగన్వాడీలు, అన్న క్యాంటిన్లు, హోటళ్లకు ప్రాధాన్యతా క్రమంలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరిగేలా చూడాలన్నారు. మరోవైపు గత ఐదు రోజులుగా గృహావసరాల కోసం రోజుకు సగటున 1.80 లక్షల సిలిండర్లు పంపిణీ చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. మరో 14,444 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. అటు అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో సంభవించిన పంట నష్టం ప్రాథమిక వివరాలపైనా ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. ఈ నెల 26వ తేదీ కల్లా పంట నష్టం అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వ్యవసాయంలో జీఎస్డీపీ 40 శాతం, ఉత్పాదన 71 శాతం పెరగడంతో పంటల నిర్వహణ, పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలన్నారు.

**ఏఐ సాయంతో తిరుమలలో పెరిగిన దర్శనాలు**

టెక్నాలజీ వినియోగించడంతో అన్నింటా మంచి ఫలితాలు వస్తున్నాయని... దీనికి తిరుమలలో పెరిగిన దర్శనాల సంఖ్యనే నిదర్శనమని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. ఏఐ సాయంతో తిరుమలలో క్యూలైన్లు, భక్తుల రద్దీ... నిర్వహణ వల్ల నిరీక్షణ సమయం తగ్గిందని, దీంతో 20 శాతం వరకు భక్తులు అదనంగా దర్శనాలు చేసుకునే అవకాశం లభించిందన్నారు. ఇప్పుడు కొండపై ప్రసాదం బావుంది, దర్శనం బావుంది, శ్రీవారి సేవకులు, భక్తుల్లో సంతృప్తి పెరిగిందని అన్నారు. అత్యాధునిక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ద్వారా తిరుమల ప్రసాదాల్లో న్యూట్రిషనల్ విలువలు, పదార్థాల క్వాలిటీ చెక్ చేస్తున్నామని, దీంతో భవిష్యత్‌లో కల్తీకి ఆస్కారం ఉండదని సీఎం అన్నారు. ఇదే తరహాలో మిగిలిన శాఖలు మెరుగైన ప్రజా సేవలకు ఏఐ ఇంటిగ్రేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఐఓటీ పరికరాలు, సెన్సార్లు, సీసీ టీవీ లాంటి వివరాలతో త్వరితగతిన నిర్ణయాలు తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. డ్రోన్ల వినియోగం ద్వారా సాగు వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెరిగేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. పొరుగు రాష్ట్రాల్లో డ్రోన్ల వినియోగంపైనా అధ్యయనం జరపాలన్నారు. రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ పెంచేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ శాఖలు అవేర్, డేటా వినియోగం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించేలా చూడటం కీలకమన్నారు. ఈ సమావేశానికి మంత్రులు కొలుసు పార్థ సారథి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

# పరీక్షాకేంద్రాలను పరిశీలించిన జిల్లా విద్యాధికారి...

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 23**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలంలో 4 పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి పి. నాగేశ్వర రావు సఖినేటిపల్లి, అంతర్వేది పాలెం, కేశవ దాసు పాలెం, మోరి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మండలం వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా విద్యాశా ఖాధికారి పి.నాగేశ్వ రరావు తెలిపారు. మండలం వ్యాప్తంగా 4 కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయని 658 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నారని ఈరోజు 658/658 మంది 100% హాజరు అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు డి.కిషోర్ కుమార్, ఏం వెంకటేశ్వరావు, ఉపాద్యాయులు పాల్గొన్నారు.



# జనసేన చే నిత్యవసర వస్తువులు పంపిణీ



**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ మార్చి 23**

మండలం,లోని గోపవరం గ్రామం, షుగర్ వ్యాధితో కాలు వేళ్ళు తొలగించబడిన గుత్తుల వెంకటలక్ష్మి కష్టాలు ఆకుల భీమేష్ ద్వారా తెలుసుకున్న సూరపురెడ్డి సురేష్;; సన్నవిల్లి గ్రామానికి చెందిన బద్రి శ్రీను, వినూష దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారి సహకారంతో 2000 రూపాయలు విలువైన నిత్యవసర వస్తువులు జనసేన నాయకుల చేతుల మీదుగా ఈరోజు ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు,నల్లా రామన్న, ఆకుల బాబి పాల్గొన్నారు.

## ఎంపీ రఘునందన్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి, సిటిజన్ టైమ్స్, మార్చి 23**

మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు పుట్టినరోజు సందర్భంగా వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రఘునందన్ రావు ప్రజల సేవలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించారని, ఆయనకు ఆయురారోగ్యాలతో పాటు మరిన్ని విజయాలు చేకూరాలని ఆకాంక్షించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శేఖర్,అరుణ్ గౌడ్,సుమన్, రంగస్వామి,నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## యమునా నది పుష్కర పురస్కారం అందుకున్న డాక్టర్ సునీల్ కుమార్ యాంద్ర



**పిఠాపురం :సిటిజన్ టైమ్స్,,మార్చి 23**

ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవనది ఫౌండేషన్ వారు తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహిస్తున్న 12 జీవ నదుల పుష్కర పురస్కారాల కార్యక్రమం రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవనది ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఇంటి లక్ష్మీ దుర్గ, సినీ మరియు టీవీ నటి రాగిణి, తొలి టెలివిజన్ వ్యాఖ్యాత విజయ దుర్గ తదితరులు పిఠాపురం పట్టణానికి చెందిన జీవనది ఫౌండేషన్ జాతీయ మీడియా కో-ఆర్డినేటర్, సినీ రచయిత, దర్శకుడు, పత్రికా సంపాదకుడు డాక్టర్ సునీల్ కుమార్ యాంద్రను యమునా నది పుష్కర పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా డా సునీల్ కుమార్ యాంద్ర మాట్లాడుతూ నదీ జలాల పరిరక్షణ కోసం జీవనది ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఇంటి లక్ష్మీ దుర్గ మరియు సభ్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం పుష్కరాలు జరుపుకోబోతున్న పవిత్ర యమునా నదీ పేరిట పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ పురస్కారం అందుకోవడంతో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు డా సునీల్ కుమార్ యాంద్ర కు శుభాకాంక్షలు తెలిపారు.

## కలెక్టరేట్‌లో ప్రముఖ సామాజిక సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి



**కాకినాడ రిపోర్టర్ సిటిజన్ టైమ్స్ మార్చి 23**

దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లు అర్పించిన జిల్లా ఇంచార్జి మంత్రి, మున్సిపల్, పట్టాభివృది శాఖ మంత్రి పి.నారాయణ.ప్రముఖ సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు సోమవారం కాకినాడ కలెక్టరేట్ లోని కోర్టు హాల్ లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కోనసీమ ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక సంస్కర్త, శెట్టి బలిజ సంక్షేమ సంఘం వ్యవస్థపకులు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా కాకినాడ కలెక్టరేట్ లో ఆయన చిత్రపటానికి జిల్లా ఇంచార్జ మంత్రి,రాష్ట్రమున్సిపల్,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరి నారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారు చేసిన సామాజిక సేవలకు గుర్తుగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంద న్నారు.దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే సామాజిక సేవతో పాటు , శెట్టిబలిజల అభ్యున్నతికి కృషి చేసి అందరి గుండెల్లో నిలిచారన్నారు . చదువుతోనే సాధికారత అనే సత్యాన్ని , విద్య ప్రాముఖ్యతను ఆరోజుల్లోనే చాటి చెప్పారన్నారు. అదే బాటలో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,విద్యా శాఖ మంత్రి లోకేష్ బాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు.రాష్ట్రంలో ఇప్పటికే 14,000 మంది ఉపాధ్యాయ నియామకాలు చేయగా,కొత్తగా మరోమారు డి ఎస్ సి ప్రకటించారన్నారు. సామాన్యులపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి , తన వారందరికీ ధైర్యాన్ని ఇచ్చిన ధీశాలి దొమ్మేటి వెంకటరెడ్డి అని పేర్కొన్నారు. ఈ జయంతి వేడుకల వేళ ఆయనను స్మరించుకుని , స్ఫూర్తి పొందుదామన్నారు.ఈ సందర్భంగా స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డికి ప్రభుత్వ విప్ లు దాట్ల సుబ్బరాజు, యనమల దివ్య, ఎమ్మెల్సీ లు పేరాబత్తుల రాజశేఖరం,కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, నిమ్మకాయ చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, సివిల్ సప్లయీస్ కార్పోరేషన్ చైర్మన్ తోట సుధీర్, మాజీ ఎమ్మెల్యే లు ఎస్వీఎస్ఎన్ వర్మ,పెండెం దొరబాబు, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ,డి ఆర్ వో డి.తిప్పేనాయక్,బిసి సంక్షేమ శాఖ అధికారి జి.శ్రీనివాస్,పలువురు ప్రజాప్రతినిధులు,శెట్టిబలిజ నాయకులు నివాళులు అర్పించారు.

# గ్యాస్ కొరత అధిగమించే మేధో మదన సదస్సు





**అమలాపురం, సిటిజన్ టైమ్స్ మార్చి 23**

ఎల్పిజి గ్యాస్ బదులుగా ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం వల్ల పరాయి దేశాలపై ఆధార పడకుండా స్వయం సమృద్ధి సాధ్యపడి ఆర్థికంగా పర్యావరణ భద్రతాపరంగా చాలా ప్రయోజనకరమని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి తెలిపారు. సోమవారం మొట్టమొదటిసారిగా కోనసీమ జిల్లాలో హోటల్ యాజమాన్యాలు పర్యాటక సంక్షేమ వసతి గృహాల వివిధ దేవాలయాల ఎగ్జిక్యూటివ్ అధికారులు వివిధ శాఖల జిల్లా అధికారులతో ఎల్పిజి గ్యాస్ కు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగంపై మేధో మదన సద స్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్త ఇంధన సరఫరా గొలుసుపై, ముఖ్యం గా భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలపై తీవ్ర ప్రభావం చూపి గ్యాస్ కొరత ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ కొరత సంక్షోభాన్ని అధిగమించేందుకు మేధో మథన సదస్సు ద్వారా పలు కంపెనీలు ప్రతినిధులు పవర్ పాయింట్ రివెంటేషన్ ద్వారా సౌర శక్తి విద్యుత్ బయోగ్యాసు పైప్ లైన్ గ్యాస్ వంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యూనిట్ల స్థాపన కై అవగాహన పెంపొందించారు. ఎల్పిజి కొరతను అధిగమించే ప్రత్యామ్నాయ మార్గాలైన విద్యుదీకరణ ఎలక్ట్రికల్ కుకింగ్,అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం అన్నారు. తదనంతరం వివిధ ప్రత్యామ్నాయ పద్ధతులను వివరించడానికి ప్రత్యక్షంగా కొందరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మరికొందరునిపుణులు క్రింది విషయాలను విరించారు. గ్యాస్ సిలిండర్లపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ఇండక్షన్ స్టవ్‌ల వాడకాన్ని పెంచాలని నిపుణులు సూచిస్తున్నారన్నారు.సౌర శక్తి, ఇతర పునరుత్పాదక ఇంధనాలతో అనుసంధా నించినప్పుడు ఈ విధానం అత్యంత చౌకైన మార్గమన్నారు.సౌరశక్తి విద్యుత్ యూనిట్లు ప్రచారాన్ని గ్రామీణ స్థాయికి తీసుకుని వెళ్లాలని సూచించారు. బయో-సిఎన్‌జి, కంప్రెస్డ్ బయోగ్యాస్ వ్యర్థాల నుండి ఇంధనాన్ని తయారు చేయడంపై సమగ్రమైన చర్చ జరిగిందన్నారు.వ్యవసాయ వ్యర్థాలు, మున్సిపల్ చెత్త పశువుల పేడ ద్వారా బయోగ్యాసును ప్రోత్సహించాలన్నారు. ఈ ప్రక్రియ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా దిగుమతుల భారాన్ని తగ్గిస్తుందన్నారు.గ్రీన్ హైడ్రోజన్ భవిష్యత్ ఇంధనంగా పిలవబడే గ్రీన్ హైడ్రోజన్‌ను వంట గ్యాస్ లో కొంత శాతం కలపడం గురించి చర్చించడం జరుగుతుందన్నారు.పైప్డ్ నేచురల్ గ్యాస్ విస్తరణ ద్వారా ఎల్పిజి సిలిండర్ల రవాణా ఖర్చులను తగ్గించడానికి, పట్టణ ప్రాంతాల్లో పైపుల ద్వారా సహజ వాయువును అందించడం కొంతమేర జరుగుతోందని దీని విస్తరణ ద్వారా ఎల్పిజి కొరతను అధిగమించాలన్నారు.ఈ గ్యాస్ మరింత సురక్షితం నిరంతర సరఫరాను నిర్ధారిస్తుందన్నారు. నేరుగా సూర్యరశ్మితో పనిచేసే సోలార్ కుక్కర్లు, సోలార్ ప్యానెల్స్ ద్వారా నడిచే హైబ్రిడ్ వంట పరికరాల రూపకల్పనపై వివిధ కంపెనీలు ప్రతినిధు లు గోదావరి పైప్డ్ గ్యాస్ ప్రతినిధి శ్రీకాంత్ నెడ్ కాప్ ఇంజనీర్ రాజు ఎస్యేస్ ఇంజనీరింగ్ అధినేత కీర్తి జైన్ వెంకటేష్ పార్వతి కిచెన్ ఈక్వయిప్మెంట్ అధినేత వినయ్ కుమార్ దృశ్య శ్రావణ మధ్యామల ద్వారా వివరించగ, జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవతో సౌర విద్యుత్ నిపుణులు రాజస్థాన్ జోదపూర్ నుండి సందీప్ కచవా గుజరాత్ బరోడా నుండి దీపక్ గదియా అధికారులతో చర్చించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రూపొందించిన సూర్య నూతన వంటి ఇండోర్ సోలార్ కుకింగ్ సిస్టమ్స్‌ను ప్రోత్సహిం చాలని నిర్ణయించారు. ఇంధన వైవిధ్యం కేవలం ఒకే రకమైన ఇంధనంపై ఆధారపడకుండా, అంతర్జాతీయ ఉద్రిక్తతల దృష్ట్యా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను పెంచినట్లుగానే, విదేశీ గ్యాస్ దిగుమతులపై ఆధారపడటం తగ్గించి, దేశీయంగా లభించే వనరులను గరిష్టంగా వినియోగించాలన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ భద్రత దృష్ట్యా ఇంధన స్వయం సమృద్ధి అనేది ప్రస్తుత తరుణంలో అత్యంత కీలకమన్నారు. ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మళ్లడం వల్ల బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయ న్నారు ప్రత్యామ్నాయ వనరులను వాడటం వల్ల బిలియన్ల కొద్దీ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగిన ప్పుడు సామాన్యుడిపై పడే భారం తగ్గుతుందన్నారు.సొంతంగా ఉత్పత్తి చేసుకునే విద్యుత్ లేదా బయోగ్యాస్ ధరలు మన నియంత్రణలో ఉంటాయన్నారు.కార్బన్ ఉద్గారాల తగ్గింపు ఎల్పిజి కంటే విద్యుత్ సౌర శక్తి బయోగ్యాస్ వంటివి తక్కువ కాలుష్యాన్ని కలిగిస్తాయన్నారు. బయోగ్యాస్ తయారీ ద్వారా పట్టణ గ్రామీణ వ్యర్థాలను సమర్థవం తంగా ఇంధనంగా మార్చవచ్చునని,ఇది స్వచ్ఛ భారత్ లక్ష్యానికి సహకరిస్తుందన్నారు.జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ. ఉదయభాస్కర్ ప్రసంగిస్తూ ఇరాన్-ఇజ్రాయెల్ వంటి యుద్ధ వాతావరణం నెలకొన్న ప్పుడు సరఫరా గొలుసు దెబ్బతిన్నా, మన దేశీయ వనరులు మనల్ని ఇబ్బంది పడకుండా కాపాడతాయ న్నారు దిగుమతులపై ఆధారపడటం తగ్గితే, అంతర్జాతీయ సంక్షోభాల సమయంలో కూడా దేశంలో ఇంధన కొరత ఏర్పడదన్నారు.ప్రతి పౌరుడు బాధ్యతగా కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఆధారిత ఇండక్షన్ స్టవ్ వంటను అలవాటు చేసుకోవాలన్నారు. ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా వంటకు ఇతర అవసరా లకు ఉచితంగా, స్వచ్ఛ మైన ఇంధనాన్ని పొందవచ్చునన్నారు.శిలాజ ఇంధనాల కంటే పునరుత్పాదక ఇంధనాల వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించాలన్నారు.భారత ప్రభుత్వం కూడా పిఎం సూర్య ఘర్ యోజన వంటి పథకాల ద్వారా రాయితీలతో ప్రజలను స్వయం సమృద్ధి దిశగా ప్రోత్సహిస్తోందన్నారు. హోటల్ యజమాన్యాలు ప్రతినిధులు తమకు అవసరమైన ఎల్పిజి గ్యాస్ కు బదులు గా ప్రత్యా మ్నాయ యూనిట్లు నెలకొల్పడంలో ముందుకు వస్తే వాటిని ప్రభుత్వానికి నివేదించి రాయితీలతో ఏర్పాటుకు తగు చర్యలు గైకొనడం జరుగుతుందన్నారు. పర్యాటక రంగం దేవస్థానంలో ప్రత్యామ్నాయ యూనిట్లు ఏర్పా టుకు ప్రభుత్వ పరంగా తగిన సహకారం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గోదావరి పైప్ లైన్ గ్యాస్ సౌరశక్తి నెట్ కాప్, ఎలక్ట్రికల్ కుకింగ్ సిస్టం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అంబటి, దీపు కుటుంబ సభ్యులను పరామర్శించిన మండలి రాజేష్

### దీపు మృతి పై తల్లి,దండ్రుల అనుమానాల పై పవన్ కళ్యాణ్ కి నివేదిక

**నూజివీడు:( సిటిజన్ టైమ్స్): మార్చి:23**



ఏలూరు జిల్లా, నూజివీడు నియోజక వర్గం, చాట్రాయిమండల పరిధిలో చాట్రాయి గ్రామంలో జన సైనికుడు అంబటి.దివ్య అనుదీప్ వర్షిత్ ను ఈ నెల 11న జరిగిన అనుమానాస్పద మృతి ఘటన పై తల్లి, తండ్రుల ను పరామర్శించి దీపు చిత్ర పటానికి నివాళు లు అర్పించారు. పోలీస్ ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేసి,దోషులపై చర్య తీసుకోవాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్ కోరారు.అనంతరం మండలి రాజేష్ మాట్లాడుతూఅంబటి అనుదీప్ పవన్ కళ్యాణ్ వీరాభిమాని.ఈ వీరాభిమాని ఇలా అనుమానస్పద మృతి చెందడం ఆ మృతి వెనక ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ఉన్న గ్రామస్తులు గాని తల్లిదండ్రులు గాని ఆ సీసీ కెమెరాలు సంబంధించిన విషయం గానీ పోస్టుమార్టం రిపోర్ట్ గాని అతని చెంప మీద కొట్టినట్టు గాయాలు ఉండడం అవన్నీ నా దృష్టికి తీసుకురావడం జరిగిందని మండల రాజేష్ అన్నారు. వీటిలో చాలా విషయాలు ఉదయం ఫోన్ కాల్ లోనే ఇక్కడ ఉన్నటువంటి జనసేన నాయకులు అందరూ నాకు చెప్పడం జరిగిందని అన్నారు. నేను స్వయంగా ఎవరైతే అంబటి అనుదీప్ ఉన్నారు వారి కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ తరఫున జనసేన పార్టీ అధ్యక్షులు వారి తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఆ కుటుంబానికి భరోసా ఇవ్వాలని ఉద్దేశంతో మా జనసేన పార్టీ నాయకులు ఇక్కడికి రావడం జరిగింది. ఇక్కడకి వచ్చే ముందు శాసనసభ్యులు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కూడా నిన్న ఇక్కడికి వచ్చి కుటుంబానికి అండగా ఉంటామని దీని వెనుక ఎవరు ఉన్న సహించేది లేదని, స్పెషల్ ఆఫీసర్ నియమించి వాళ్ళ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే అనుదీప్ పవన్ కళ్యాణ్ వీరాభిమాని ఇతనికి ఇలా జరగడం అనేది చాలా బాధాకరం నాకు కూడా చాలా బాధనిపించింది. ఎందుకంటే సోషల్ మీడియాలో ఆ ఫోటోలు చూస్తే ఎవరైనా మన కుటుంబ సభ్యులు అలా అయితే చాలా బాధ అనిపించింది. చెప్పడానికి కూడా చాలా ఇబ్బందిగా ఉంది. ఆ అనుదీప్ అనుమానస్పద మృతి వెనక ఏ రాజకీయ పార్టీ నాయకులైన సరే అధికార పార్టీ నాయకులు కావచ్చు, ప్రతిపక్ష పార్టీ నాయకులు కావచ్చు, సిపిఐ పార్టీ నాయకులు కావచ్చు, సిపిఎం పార్టీ నాయకులు కావచ్చు, బిజెపి పార్టీ నాయకులు కావచ్చు, ఎవరైనా సరే అది ఆత్మహత్య కాదు హత్య అని గావించబడిన రోజు జనసేన పార్టీ ఏ విధమైన శిక్షలు విధించబోతుంది అనేది మీరే చూస్తారు చూపిస్తాము. అదేవిధంగా ఆ కుటుంబానికి ఇచ్చే భరోసా ఏంటంటే ఈరోజు వారు చెప్పిన విషయాలన్నిటిని కూడా ఒక నివేదిక రూపంలో ఇచ్చి మా ఇన్చార్జి అయిన బర్మా పని బాబు అలాగే లోకల్ నాయకులు అందరూ కూడా తీసుకొని రేపు సాయంత్రం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి అందజేసి ఆయన నిర్ణయం మేరకు డీజీపీని కలవడమా,స్వయంగా ఆయన డీజీపీతో మాట్లాడి రేపు సాయంత్రానికి డిసైడ్ చేసి ఆ కుటుంబానికి న్యాయం చేస్తామని జనసేన పార్టీ తరఫున గ్రామస్తుల అందరికీ తెలియజేస్తున్నాను. అంతేకాకుండా జనసేన పార్టీ నాయకులకి కార్యకర్తలకి వీర మహిళలకి నేను చెప్పేది ఏంటంటే తెలుగు రాష్ట్రాలలో ఏ జనసైనికుడికి ఎక్కడ చిన్నపాటి ఇబ్బంది జరిగిన మేమందరం ఒకటే కుటుంబం మా కుటుంబంలో ఏ వ్యక్తికి ఏమైనా జరిగిన మేమంధరం ఒకటే అని.ఎవరైనా సరే ఇంకొకసారి జన సైనికుల జోలికి వస్తే రావాలి అంటే ఉచ్చ పోసుకునే విధంగా మేము కార్యాచరణని రూపొందించి.యావత్ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రతి జనసైనికుడికి నేను చెప్తున్నా ఎవరైనా సరే జనసైనికుల జోలికి రావాలంటే అది ఏ పార్టీ నాయకులు అయినా సరే వాళ్ళ ఒళ్ళు దగ్గర పెట్టుకునే లాగా ఒక కార్యాచరణ రూపొందించి. మనం అందరం ఒక కుటుంబం కాబట్టి ఏదైతే హత్య జరిగిందో ఆ కుటుంబానికి యావత్ జన సైనికులు అందరూ కూడా అండగా ఉంటామని మీకు తెలియజేస్తున్నాను.జనసేన పార్టీ అంటే నీతి నిజాయితీ నిబద్ధత కలిగిన పార్టీ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీని స్థాపించింది ప్రజలకు ఎటువంటి సమస్యలు ఆ సమస్యలను పరిష్కరించడానికి పెట్టిన పార్టీ జనసేన పార్టీ.ఆ కోణంలో తప్పు జనసేన పార్టీ కార్యకర్త చేసినా కూడా ఉపేక్షించమని అది మండల రాజేష్ చేయొచ్చు,బర్మా పని బాబు చేయొచ్చు అది ఎవరు చేసిన జనసేన పార్టీలో అందరికీ ఒకటే న్యాయం ఉంటుంది.అది పవన్ కళ్యాణ్ పెట్టిన పార్టీ.ఇది ప్రతి ఒక్కరికి న్యాయం చేసే విధంగా ఉంటుంది తప్ప మా నాయకులు తప్పు చేసిన కూడా శిక్షించేది నాయకులు పవన్ కళ్యాణ్. అలాంటి నాయకుని కార్యకర్తలం, జన సైనికులం మేమందరం. అది ఏం జరుగుతుంది అనేది వేచి చూడాలి. 48 గంటల్లో ఆ కుటుంబానికి న్యాయం చేసే బాధ్యత జనసేన పార్టీ తీసుకుంటుంది అని మీ అందరికీ తెలియజేస్తున్నాను అని మండలి రాజేష్ అన్నారు.ఈ కార్యక్రమంలో నూజివీడు పి ఓ సి బర్మ.ఫణి బాబు ,ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు .శివరామకృష్ణ ,రోడ్ కార్పొరేషన్ డైరెక్టర్ గరికిపాటి . శివశంకర్ ,నూజివీడు నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు మామిడిశెట్టి సత్తిబాబు, సూరిశెట్టి శివ చైతన్య,చేపూరి నాగ శ్రీనివాసరావు, గరిగంటి జగదీష్, షేక్ ఇమాంషా( పండు ), చేపూరి సాయికృష్ణ,ముమ్మాలనేని సునీల్ కుమార్, యర్రం శెట్టి రాము,తుమ్మల జగన్, పాపారావు,కొండవీటి. ఈశ్వర్,చిన్న కోటయ్య ,మండల అధ్యక్షులు, జనసైనికులు,గ్రామస్తులు ,పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నృసింహాలయంలో టెండర్లు ఖరారు...



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 22**

డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం, అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానంనకు కూరగాయలు సప్లయి చేయు హక్కు, సెల్ ఫోన్లు, లగేజి భద్రపరచే లైసెన్సు హక్కులకు సంబంధించి టెండర్ కం బహిరంగ వేలములు స్థానిక ఎంపిటిసి నాగరాజు, శ్రీ కపోతేశ్వర స్వామి వారి దేవస్థానం, కడలి కార్య నిర్వాహణాదికారి టి నాగవిష్ణు పర్యవేక్షణలో నిర్వహించడమైనది. అలాగే ప్రింటింగు, స్టేషనరీ సప్లై , వస్త్రములు, తలనీలాల సేకరించుకొనే హక్కునకు సంబంధించిన టెండర్లు సరైన ధరలు రానందున వాయిదా వేయడమైనదని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాద్ తెలియజేశారు.

## ఎం ఎస్ ఎం ఈ స్కీమ్ లు, రుణ మంజూరులపై లోక్ సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశ్న.

**విజయవాడ/ న్యూఢిల్లీ: (సిటిజన్ టైమ్స్): మార్చి:23**

ఎం ఎస్ ఎం స్కీముల రుణాల మంజూరు పై లోక్ సభలో ఎంపీ కేసీఆర్ ప్రశ్నించగా భారీ ఊరట నిస్తూ స్కీమ్ లు అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు సమాధానం ఇచ్చిన కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి. ఎటువంటి పూచీకత్తు లేకుండా రుణ పరిమితి రూ.20లక్షలకు పెంచినట్లు వెల్లడి.గడచిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 6.37 లక్షల మందికి రుణాలు ఇచ్చినట్లు స్పష్టం చేసిన మంత్రి. లిరానున్న కాలంలో ఆంధ్రప్రదేశ్ లో ఎం ఎస్ ఎం ఈ రుణ దరఖాస్తుల జోరు మరింత పెరుగుతుందని తెలిపిన కేంద్ర ప్రభుత్వం.



# అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

## జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి






**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 23**

ప్రజా వేదికలో అందిన ప్రతి అర్జీని అధికారు సవాల్ గా తీసుకుని నాణ్యమైన పరిష్కారం చూపితే అర్జీదారులు సంతృప్తి చెందు తారని జిల్లా సంయుక్త కలెక్టర్ టీ నిశాంతి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వ హించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో అర్జీ దారుల నుండి సుమారుగా 220 అర్జీలను జాయింట్ కలెక్టర్ ఆర్డీవో జి. మమ్మీ, డ్వామా పి డి మధుసూదన్ డి ఆర్ డి ఏ: పి డి రాంబాబులు స్వీ కరించారు. ఈ సందర్భం గా జె సి మాట్లా డుతూ ప్రజల సంతృప్తే సేవల్లో నాణ్యత కు గీటు రాయి అన్నారు. ప్రతి ఆర్టీని సకాలంలో నిబద్ధతతో పరిష్కరించా లని అధి కారులను ఆదే శించారు.అర్జీల పరిష్కారం లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరిం చారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం కావాలన్నారు. ప్రజల సమస్యలు క్షేత్రస్థాయిలోనే పరిష్కరించా లనే లక్ష్యంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మాన్ని అన్ని స్థాయిలలో నిర్వహిస్తు న్నట్లు తెలిపారు ప్రజలకు చేరువగా సుపరి పాలన అందించే దిశగా ప్రజా వేదిక పనిచేస్తుందన్నారు అర్జీదారులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, పారదర్శకంగా సమస్యల పరిష్కారం జరగాలన్నారు. నాణ్య మైన సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చ రించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశించిన కాలపరిమితి లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కేవలం కార్యా లయాలకే పరిమితం కాకుండా, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల తీవ్రతను బట్టి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, ఎక్కడా జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు.ఆమె ఫిర్యాదు దారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్య లను పూర్తి గా విని తక్షణమే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజా వేదిక రెవెన్యూ క్లినిక్ లలో ప్రజలు సమర్పించిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, క్షేత్రస్థాయి లో అర్జీదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కా రాలు అందించాలని సూచించా రు. ఏ శాఖకు వచ్చిన అర్జీలు ఆ శాఖ అధికారులే పరిష్కరించాలని, వేరే శాఖలకు పంపడం వల్ల కాలయాపన జరిగి సమస్యలు సంక్లిష్టమవుతాయన్నారు. క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపి, అర్జీలు మళ్లీ రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. అర్జీలకు మెరు గైన పరిష్కారాలు చూపు తూ వ్యవస్థ పట్ల విశ్వసనీయతను పెంచాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ తీరు పట్ల ప్రజల్లో మరింత నమ్మకం, గౌరవం పెరిగేలా అధికారు లు అంకితభావంతో పని చేయాలని ఆమె కోరారు. భూ సమస్యల ను రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించు కోవాలని తెలిపారు .ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ దివ్యాంగ అర్జీ దారుల వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీల రిజిస్ట్రేషన్ కౌంటర్ను పరిశీలించి అర్జీలు సక్రమంగా నమోదు అవుతున్నాయా లేదా అని తనిఖీ చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసిన సిఐ అనిల్ కుమార్



**కలికిరి రిపోర్టర్ మార్చి 21. సిటిజన్ టైమ్స్**

కలికిరి మండలం మేడికుర్తి క్రాస్ సమీపమున రోడ్డుపై కలికిరి సీ ఐ అనిల్ కుమార్ తన పోలీసు బృందముతో కలిసి వాహనముల తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై ముగ్గురు అనుమానాస్పదంగా వస్తుండగా వారిని ఆపేందుకు ప్రయత్నం చేయగా వారు తప్పించుకునేందుకు వేగంగా పారిపోతుండగా అడ్డుకొని పట్టుకొని విచారించగా వారి నుంచి వారు దాచిపెట్టిన 135 కిలోల ఎర్ర చందనం దుంగలతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా కోర్టు ఆదేశాల మేరకు వారిని రిమాండ్ తరలించినట్టు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

## జొన్నాడ సెంటర్లో పట్టుకున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు




**ఆలమూరు సిటిజన్ టైమ్స్ మార్చి 23**

జొన్నాడ సెంటర్లో గృహ అవసరాలకు వినియోగించవలసిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను, హోటల్లో ఉపయోగిస్తున్నందుకు పౌరసరఫరాల డిప్యూటీ తాసిల్దార్ వెంకటేశ్వరరావు రాజమండ్రి విజిలెన్స్ డిపార్ట్మెంట్ వారు పట్టుకున్నన్నట్లు ఎమ్మెస్ఓ డిప్యూటీ తాసిల్దార్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## పిఠాపురం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా పాడా పిడిబి. హెచ్. భవాని శంకర్ బాధ్యతల స్వీకరణ

**పిఠాపురం :సిటిజన్ టైమ్స్, మార్చి 23**



కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం, పిఠాపురం పట్టణంలో పిఠాపురం ప్రాజెక్ట్ డైరెక్టర్ వారిని పిఠాపురం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినది. సదరు ఉత్తర్వులను అనుసరించి, సోమవారం నుండి బి. హెచ్. భవాని శంకర్, పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ గా అధికారికంగా బాధ్యతలు స్వీకరించినారు.

# ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా బీజేపీ జనతా వారధి

### సంచార జాతుల వారికి కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేత

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 23**



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంచార జాతుల వారికి కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ డిమాండ్ చేశారు.జిల్లా ప్రధాన కార్యదర్శి చీకురుమెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం అమలాపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట జనతా వారధి హెల్ప్ లైన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి ఈ మధ్య వారధిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఆదేశాలతో జనతా వారధి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఈరోజు కూడా అనేక మంది అర్జీ దారులు జనతా వారధి ద్వారా కొన్ని సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా సంచార జాతుల వారికి కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేస్తే వారు విద్యలోనూ, వ్యాపారంలోనూ, ఉద్యోగ అవకాశాలు లోనూ ఉపయోగించుకుంటారని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లవరం మండల అధ్యక్షులు నారాయణ మూర్తి, సీనియర్ నాయకులు దాకే వెంకటరావు, కొండేటి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం పట్టణంలో తాగునీరు, డ్రైన్స్, సీసీ రోడ్లు వీధీ దీపాలు, పార్కుల అభివృద్ధి వంటి పనులకు తొలి ప్రాధాన్యత..

### పిఠాపురంలో మంత్రి నారాయణ పర్యటన..

### పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి పిఠాపురం పట్టణం అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి నారాయణ..




**పిఠాపురం :సిటిజన్ టైమ్స్,, మార్చి 23**

పిఠాపురం పట్టణంలో తాగునీరు, డ్రైన్స్, సీసీ రోడ్లు,వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి వంటి పనులకు తొలి ప్రాధాన్యతనిచ్చి పనులు చేపట్టడం జరుగుతుందని, జిల్లా ఇంఛార్జి మంత్రి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. జిల్లా ఇంఛార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సోమవారం కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా, పిఠాపురం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి అధికారులు ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్, పురపాలక శాఖ ప్రాంతీయ ఆర్డీఎంఏ సీహెచ్.నాగ నరసింహారావు, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, పాడా పీడీ బీహెచ్ భవానీ శంకర్; పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ,పెండెం దొరబాబు, అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ పిఠాపురం మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఇతర ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిఠాపురంలో60 కోట్లు, గొల్లప్రోలు లో 80 కోట్లతో అమృత్ పథకరం ద్వారా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. వచ్చే రెండేళ్లలో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. పిఠాపురం లో 14.6 కోట్లు, గొల్లప్రోలులో 8 కోట్లతో ఇళ్లలో వాడిన నీటిని ట్రీట్ చేసి బయటకు పంపించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు రాబోయే రెండేళ్లలో పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల్లో తాగునీరు, డ్రెయిన్లు, సీసీ రోడ్లు, పార్కు లు, వీధిలైట్లు పనులకు తొలి ప్రాధాన్యతనిచ్చి 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఇరిగేషన్ పనులకు సంబంధించి అవసరమైన ప్రతిపాదన సిద్ధం చేయాలని ఈ సందర్భంగా మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. వచ్చే ఆరు నెలల్లో మునిసిపాలిటీల్లో ఎన్నికల నిర్వహించడం జరుగుతుందని, మున్సిపాలిటీల్లో డివిజన్ల పెంపుపై అధికారులు కసరత్తు చేస్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు. సమీక్షా సమావేశంలో పిఠాపురం కమిషనర్ ఎన్.కనకారావు, గొల్లప్రోలు కమిషనర్ పీ.శ్రీనివాసు, ఇరిగేషన్, శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా, ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు

### టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గూడాల ఫణి

**అంబాజీపేట సిటిజన్ టైమ్స్ మార్చి 23**



ఆంధ్రప్రదేశ్ ఎన్డిఏ కూటమి ప్రభుత్వం శెట్టిబలిజ సామాజిక వర్గ పితామహుడు కీర్తిశేషులు శ్రీ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతినిలి ప్రతి సంవత్సరం మార్చి 23న నిర్వహించాలని నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి ప్రత్యేక ధన్యవాదములు, కృతజ్ఞతలులి తెలుపుతున్నట్లు అంబాజీపేట తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గూడాల ఫణి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి

### నివాళులర్పించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా




**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 23**

దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) రాహుల్ మీనా పాల్గొని, వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.లి ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సమాజానికి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. వారి ఆశయాలు, స్ఫూర్తి నేటి తరానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ నివాళి కార్యక్రమంలో ఎస్పీ తో పాటు పలువురు ఉన్నతాధికారులు ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్ అడిషనల్ ఎస్పీ, (అడ్మిన్), సుబ్బరాజు ఏఆర్ డిఎస్పీ ,పుల్లారావు ఎస్బి సిఐ,బ్రహ్మానందం ఏఆర్ ఆర్ఐ,కోటేశ్వరావు ఏఆర్ ఆర్ఐ,,నాగ ప్రసాద్ డిసిఆర్బిసిఐ, వీరితో పాటు పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది ,ఇతర పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని పూలమాలలతో నివాళులర్పించారు.

## గోపనపల్లిలో అక్రమ నీటి తరలింపు

### – తీవ్ర తాగునీటి సంక్షోభం

### ఎమ్మార్వోకు గ్రామస్థుల ఫిర్యాదు



**శేరిలింగంపల్లి, సిటిజన్ టైమ్స్, మర్చి 23**

శేరిలింగంపల్లి మండలం పరిధిలోని గోపనపల్లి గ్రామంలో భూగర్భ జలాల అక్రమ వినియోగం, ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపుల కారణంగా తీవ్ర తాగునీటి సంక్షోభం నెలకొంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యపై గ్రామస్థులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పరిస్థితి మరింత విషమించిందని తెలిపారు. గ్రామ పరిధిలో పెద్దఎత్తున బోర్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని వాణిజ్య అవసరాల కోసం తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ప్రభావంతో భూగర్భ జల మట్టాలు గణనీయంగా పడిపోయి బోర్లు ఎండిపోయాయి. ప్రస్తుతం 1200 నుంచి 2000 ఫీట్లు బోర్లు వేసినా నీరు అందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా గ్రామ ప్రజలు రోజువారీ అవసరాలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు గ్రామస్థులు ట్యాంకర్లను అడ్డుకుని నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ తాత్కాలిక చర్యలకే పరిమితమైందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై సోమవారం గోపనపల్లి గ్రామస్థులు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి అక్రమ నీటి తరలింపును అరికట్టడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి విచారణ జరిపి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజు నాయక్, మూలగిరి శ్రీనివాస్, సురేందర్, శివకుమార్, వేణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోని రైతులకు 365 రోజులు నీరు అందించడమే లక్ష్యం





**దెందులూరు:( సిటిజన్ టైమ్స్): మార్చి 23**

దెందులూరు నియోజకవర్గంలోని రైతులకు 365 రోజుల పాటు సాగునీరు అందించడమే తన జీవితానికి సార్థకత అని - అందుకోసమే రూ.280 కోట్ల రూపాయలు వెచ్చించి పోలవరం రైట్ మెన్ కెనాల్ ద్వారా అనేక గ్రామాలకు ఇంటింటికి త్రాగు నీటితో పాటు సాగునీరును 365 రోజులు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, రాబోయే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో చర్చించి వారి సహకారంతో , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ఈ బృహత్తర ప్రాజెక్టును పూర్తి చేసి దెందులూరు నియోజకవర్గం లోని రైతాంగానికి సుభిక్షంగా సాగునీరు అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలం దెబ్బ గూడెం, లక్ష్మీపురం, న్యాయంపల్లి , మొండూరు గ్రామాల్లోని పోలవరం రైట్ మెన్ కెనాల్ పరివాహక పలు గ్రామాల్లో సోమవారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నీటిపారుదల శాఖ , మరియు గ్రామీణ నీటి సరఫరాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నూతనంగా చేపట్టబోతున్న ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లిఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పోలవరం ప్రాజెక్టు రైట్ మెన్ కెనాల్ నిర్మాణం చేపట్టినప్పుడు పెదవేగి మండలంలోని దిబ్బగూడం పంచాయతీ రెండు ముక్కలుగా విడిపోయిందని, మొదట్లో జరిగిన ప్రణాళికల్లో ఈ అంశాలు లేకపోయినప్పటికీ కూడా అప్పట్లో రైతులందరినీ ఒప్పించి హైకోర్టులో ఉన్న కేసులను విత్డ్రా చేయించి ఆనాటి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చొరవతో మంజూరు చేయడం జరిగిందని అదేవిధంగా ఈ రెండు గ్రామాలకు బ్రిడ్జిలు కూడా మంజూరు చేసి నిర్మాణం చేస్తామని అనాడు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయితే దురదృష్టవశాత్తు 2019లో ప్రభుత్వం మారినప్పుడు అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వల్ల ఈ ప్రాజెక్టు పూర్తిగా నిర్వీర్యం అయిందని ప్రాజెక్టుతో పాటు లిఫ్టు పనులు గాని బ్రిడ్జి నిర్మాణ పనులు గాని,కెనాల్ పనులు గాని,ముందడుగు వేయక ప్రాజెక్టు లక్ష నిర్వీర్యిమైందని తెలిపారు. అందువల్ల కూటం ప్రభుత్వం ఆధ్వర్యంలో మరోసారి ఈ బ్రిడ్జి నిర్మాణం కి చర్యలు చేపట్టామని ఈ వేసవిలోనే బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టి త్వరలోనే బ్రిడ్జిని కూడా ప్రారంభోత్సవం చేసే విధంగా చర్యలు చేపట్టి బ్రిడ్జిను గ్రామానికి అంకితం చేస్తామని దెందులూరు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా పెదవేగి మండలంలోని పలు గ్రామాల్లో సుదీర్ఘకాలంగా గ్రౌండ్ వాటర్ నిల్వలు తగ్గిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వారందరికీ శాశ్వతంగా పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు అందించే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. కొంతమంది రాజకీయ దళారులు తమ పొట్టకూటి కోసం, తామే అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామంటూ కొందరిని తప్పుదోవ పట్టిస్తూ, మభ్యపెడుతున్నారని, అయితే ఏ అభివృద్ధి కార్యక్రమమైనా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతుందే తప్ప ప్రజలను మభ్యపెట్టే కొందరు రాజకీయ దళారులు పొట్టకూటి కోసం వచ్చే వాళ్ళ వల్ల కాదని, అది వారి తరం కూడా కాదని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పోలవరం కుడి కాలువ మరియు నీటిపారుదల మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల ఇంజనీరింగ్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మౌలాభి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆర్థిక సాయం



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, మార్చి 23**

గిద్దలూరు పట్టంలోని శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన పోతుగంటి మౌలాబి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వెంటనే స్పందించారు. బాధితురాలి కుమారుడు, వికలాంగుడైన పోతుగంటి దస్తగిరిని పిలిపించి పరామర్శించారు. తక్షణ సహాయంగా రు10,000 ల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా ఒంగోలులోని సంబంధిత ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి, మౌలాబికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాధితురాలి కుమారుడు వికలాంగుడైన దస్తగిరి తో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము అందించిన రు 10000 /- రూపాయలను ఆసుపత్రి ఖర్చులకు వినియోగించుకోవాలని సూచించారు అంతేకాకుండా ఏ అవసరం ఉన్నా తనను వచ్చి కలవాలని దస్తగిరికి ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మౌలాబి కుమారుడు దస్తగిరి ఎమ్మెల్యేకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ్ నగర్ కాలనీ నివాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలి

**మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి**



**పొదిలి , సిటిజన్ టైమ్స్, మార్చి 23**

ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని మండల వ్యవసాయ అధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోరారు. సోమవారం నాడు మండలంలో రైతన్న మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి పాములపాడు, కుంచేపల్లి రైతు సేవ కేంద్రాలను సందర్శించారు. అలాగే ఆయా గ్రామాల్లోని రైతులకు సమావేశం జరిపి ప్రభుత్వ పథకాలను వివరించారు. అలాగే రైతులు పండించిన ఉత్పత్తుల గురించి పరిశీలించిన ఆయన వాటిని విక్రయించుకునే పద్ధతులను వివరించారు. చిరుధాన్యాల కు డిమాండ్ పెరిగిందని, అందువల్ల రైతులు ఆయా పంటల పట్ల ఆసక్తి చూపించాలని ఆయన సూచించారు. అలాగే రైతులు పండించిన పంటలను పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## డాక్టర్ ధన్యాసి మాలకొండయ్యకు నివాళులర్పించిన రావుల వెంకయ్య




**కందుకూరు, సిటిజన్ టైమ్స్, మార్చి 23**

మాజీ కొండేపి సమితి అధ్యక్షులు కందుకూరు పట్టణంలో పేరు గడించిన డాక్టర్ మాల కొండయ్య కు సిపిఐ జాతీయ నాయకులు రావుల వెంకయ్య ,సిపిఐ నియోజవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు ఘన నివాళు లర్పించారు. డాక్టర్ దన్యాసి మాల కొండయ్య సోమవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న రావుల వెంకయ్య, సిపిఐ నాయకులు కందుకూరు పట్టణంలోని ఆయన నివాసానికి చేరుకొని భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రావుల వెంకయ్య ధన్యాసి మాలకొండయ్యతో తమకున్న ఉద్యమ నేపథ్యం ధన్యాసి మాల కొండయ్యకు సిపిఐ పార్టీతో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. కందుకూరు వచ్చిన సందర్భంలో పార్టీ సభ్యులుగా ఆయన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు అని సిపిఐ తరపున కొండేపి సమితి అధ్యక్షునిగా ఎన్నికయ్యారని ఉద్యమ నేపథ్యాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అనివార్య కారణాల వలన పార్టీ నుండి బయటకు వచ్చిన తుది వరకు అన్ని విధాలుగా పార్టీకి అండగా ఉన్నారని అన్నారు. అనంతరం ఆయన సతీమణిని, కుటుంబ సభ్యులను రావుల వెంకయ్య ఓదార్చారు.

## బి.సి.ల ఆత్మగౌరవాన్ని చాటిన చంద్రబాబు

**ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు - దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఇక రాష్ట్ర పండుగ**

**బి.సి.లకు అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం**

**దొమ్మేటి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై హర్షాతిరేకాలు: మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ చిత్రపటాలకు పాలభిషేకం**

**బి.సి.ల సంక్షేమమే మా లక్ష్యం: ఎమ్మెల్యే ఆనందరావు**



**అమలాపురం సిటిజన్ టైమ్స్, మార్చి 23**

వెనుకబడిన తరగతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగ'గా ప్రకటించడం బి.సి.ల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సోమవారం అమలాపురం హైస్కూల్ సెంటర్ వద్ద దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలు, శెట్టిబలిజ సామాజిక వర్గ ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని.. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ: యువగళం పాదయాత్రలో బి.సి.ల కష్టాలను స్వయంగా చూసిన మంత్రి శ్రీ నారా లోకేష్ గారు, అప్పట్లో ఇచ్చిన హామీని నేడు నెరవేర్చారని కొనియాడారు. దొమ్మేటి వారి సేవలను గుర్తించి, రాష్ట్ర పండుగగా నిర్వహించడం ద్వారా శెట్టిబలిజ సామాజిక వర్గానికి సముచిత గౌరవం లభించిందన్నారు. నాడు దొమ్మేటి వారు కోనసీమలో విద్యకు వేసిన పునాదిని, నేడు చంద్రబాబు నాయుడు అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ బి.సి.లకు వెన్నెముకగా ఉంటుందని, సామాజిక న్యాయం కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో, పవన్ కళ్యాణ్ సహకారంతో కోనసీమ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దొమ్మేటి వెంకటరెడ్డి చూపిన మార్గంలో పయనిస్తూ, సామాజిక న్యాయం, విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే. పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, శెట్టిబలిజ సంఘ ప్రతినిధులు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గుడ్ టచ్ -బ్యాట్ టచ్ పై అవగాహన..



**పుల్లల చెరువు, సిటిజన్ టైమ్స్, మార్చి 23**

పుల్లల చెరువు కేజీబీవీ పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గుడ్ టచ్- బాడ్ టచ్, పోక్సో చట్టం,గంజాయి,బాల్య వివాహాలు పై కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం పుల్లల చెరువు ఎస్ఐ సాంబశివరావు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో చక్కటి లక్ష్యాలను ఎన్నుకుని సరైన మార్గంలో శ్రమిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. గంజాయికి,నాటుసారకి అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని, విచ్చలవిడిగా సాంకేతిక రంగం ద్వారా వారి దురాలవాట్లను మనకు రుద్దే ప్రయత్నం చేస్తున్నారని మంచిని తీసుకుని చెడును వదిలేయాలని సూచించారు. యువత గంజాయి మత్తులో జీవితాలు నాశనం చేసుకుని కుటుంబాలకు శోకం మిగిల్చవద్దని సూచించారు. యువత చదువు, క్రీడలు తప్పా ఇంకో ఆలోచన దరికి చేరనీయొద్దన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పొక్సో యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన పరచడానికి పోక్సో పై చైతన్యం పేరుతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాల్యవివాహాల వల్ల కలుగు నష్టాలు, సమస్యలు తెలి యజేస్తూ వాటిని ప్రోత్సహించిన వారికి కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టంపై వివరించారు. ఫేస్బుక్, వాట్సప్, ఇన్స్టాగ్రామ్ వంటి వాటిని ఉపయోగించడంలో చాలా జాగ్రత్తలు తీసుకొని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్పందన విద్యాసంస్థల 35వ వార్షికోత్సవ వేడుకల లోగోలి ఆవిష్కరించిన ముత్తుముల




**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, మార్చి 23**

ఏప్రిల్ 2న రాచర్ల మండల కేంద్రంలోని స్పందన విద్యాసంస్థలలో జరుగనున్న 35వ వార్షికోత్సవ వేడుకల లోగోను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. తమ విద్యాసంస్థల 35వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కాలవసిందిగా స్పందన విద్యాసంస్థల యాజమాన్యం ఎమ్మెల్యే ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ వేడుకలను వైభవంగా నిర్వహించాలని సూచించారు. లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో స్పందన విద్యాసంస్థల చైర్మన్ పేర్ల పరమేశ్వర రెడ్డి, మేనేజింగ్ డైరక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి, రాచర్ల సహకార సంఘం అధ్యక్షులు గోపిరెడ్డి జీవనేశ్వర రెడ్డి, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



**పొదిలి, సిటిజన్ టైమ్స్, మార్చి 23**

రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మండలంలోని కుంచేపల్లి గ్రామ సమీపంలో జరిగింది. సోమవారం నాడు మర్రిపూడి మండలంలోని శివరాయిని పేట గ్రామానికి చెందిన కొమ్ము ప్రభుదాస్ అనే 22 సంవత్సరాల యువకుడు ఈగల పాడు గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరై, తిరిగి తన స్వగ్రామానికి మోటార్ సైకిల్ పై వస్తుండగా కుంచ పల్లి గ్రామ సమీపంలో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ప్రభుదాస్ కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ప్రభుదాస్ ను పొదిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కై చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనపై పొదిలి ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నారు.

# శంకర్ మళ్లీ లైఫ్ రిస్క్ ప్రాజెక్ట్ చేస్తున్నాడా?



నభా నటేష్ ఎప్పుడూ మీ కలల్లోనే ఉంటుంది



ఇండస్ట్రీలో ఎవరి లైఫ్ ఎలాంటి టర్న్ తీసుకుంటుందో ఎలాంటి మలుపులు, కుదుపులకు లోనవుతుందో చెప్పడం కష్టం. ఇప్పుడు అలాంటి ఇబ్బందికర పరిస్థితుల్నే ఎదుర్కొంటున్నారు స్టార్ డైరెక్టర్ శంకర్. తనదైన మార్కు భారీ బడ్జెట్ సినిమాలతో కోలీవుడ్, టాలీవుడ్‌లలోనే కాకుండా దేశ వ్యాప్తంగా మంచి పాపులారిటీని సొంతం చేసుకుని ఇండియన్ టాప్ డైరెక్టర్లలో ఒకరిగా ఎదిగిన ఆయన ఇప్పుడు మాత్రం చాలా గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. -రోబో- వరకు సాఫీగానే సాగిన శంకర్ ప్రయాణం చియాన్ విక్రమ్‌తో చేసిన -ఐ- నుంచి దారి తప్పుతూ కుదుపులకు గురవుతోంది.

భారీ అంచనాల మధ్య చేసిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌గా నిలిచి శంకర్‌కు షాక్ ఇచ్చింది. ఈ మూవీ ఇచ్చిన షాక్‌కి ఆస్కార్ ఫిల్మ్ వి.రవిచంద్రన్ మరో సినిమా చేయలేకపోయారు. కమల్‌తో కలిసి సహ భాగస్వామిగా -విశ్వరూపం- రెండు భాగాలని నిర్మించినా సోలో ప్రొడ్యూసర్‌గా మాత్రం ప్రొడక్షన్ ఆపేసి షాక్ ఇచ్చారు. ఇక ఈ మూవీ తరువాత లైకా ప్రొడక్షన్‌తో కలిసి చేసిన -2.ఓ- ఫరవాలేదు అనిపించినా ఆశించిన లాభాల్ని మాత్రం తెచ్చి పెట్టలేకపోయింది.ఇదే సంస్థలో కలిసి శంకర్ చేసిన -ఇండియన్ 2- వివాదం ఇప్పటికీ శంకర్‌ని వెంటాడుతూనే ఉంది. ఈ సినిమా షూటింగ్ సమయంలో క్రేన్ యాక్సిడెంట్ జరగడం, అందులో డైరెక్షన్ టీమ్‌కు సంబంధించి నలుగురు వ్యక్తులు మృతి చెందడంతో శంకర్‌కు, లైకాకు మధ్య వివాదం ముదిరి సినిమా ఆగిపోయే దాకా వచ్చింది. -విక్రమ్- సక్సెస్ తరువాత ఉదయనిధి స్టాలిన్‌ని ఒప్పించిన కమల్ లైకా, శంకర్‌ల మధ్య సయోధ్య కుదిర్చి -ఇండియన్ 2-ని పూర్తి చేసి రిలీజ్ చేయించాడు. ఫలితం డిజాస్టర్.ఇదే డిజాస్టర్ అనిపించుకుంటే దీనికి సీక్వెల్ గా -ఇండియన్ 3-ని కూడా అప్పటికే మొదలు పెట్టి మధ్యలో ఆపేశారు. ఇప్పుడు దీన్ని

పూర్తి చేసి ఓటీటీకి ఇవ్వడం శంకర్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. దీనిపై లైకా వర్గాలు ఇప్పటికీ శంకర్‌పై గుర్రుగానే ఉన్నారు. దీన్ని పూర్తి చేయకుండా శంకర్ తన డ్రీమ్ ప్రాజెక్ట్ -వేల్పరి-ని పట్టాలెక్కించాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. అది అంత ఈజీ కాదని తెలుస్తోంది. -ఇండియన్ 3-ని పూర్తి చేయకుండా శంకర్ -వేల్పరి-ని స్టార్ట్ చేస్తే లీగల్ గా ప్రొసీడ్ అవుతామని లైకా వర్గాలు బాహాటంగానే హెచ్చరిస్తున్నాయి. ఈ వివాదాం సద్దుమనగాలంటే శంకర్ -ఇండియన్ 3-ని పూర్తి చేయాల్సిందే. దాన్ని పూర్తి చేసి -వేల్పరి-ని మొదలు పెట్టాలంటే ప్రొడ్యూసర్ ఎవరన్నది ఇప్పుడు శంకర్‌కు ప్రధాన సమస్యగా మారింది. అంతే కాకుండా ఈ ప్రాజెక్ట్‌కు కమిట్ అయ్యే హీరోలు రెండేళ్లు డేట్స్ ఇవ్వాల్సిందే. అలా డేట్స్ ఇచ్చే పరిస్థితిలో ఏ హీరో కనిపించడం లేదు. శంకర్ కాబట్టి ధనుష్ డేట్స్ ఇచ్చే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ధనుష్ ఇప్పటికే వరుస ప్రాజెక్ట్‌లని ప్రకటించాడు. ఇళయరాజా బయోపిక్‌తో పాటు అబ్దుల్ కలాం బయోపిక్ కూడా లైన్‌లో ఉంది. అంతే కాకుండా తన 55వ ప్రాజెక్ట్‌ని ఇటీవలే మొదలు పెట్టాడు. అది పూర్తి చేయాలి. -వేల్పరి- ఛారిత్రక నేపథ్యంలో సాగు పీరియాడిక్ మూవీ దీనికి భారీ సెట్స్ తో పాటు భారీ బడ్జెట్ చాలా అవసరం. శంకర్ ప్రస్తుత రికార్డ్‌ని బట్టి ఇంత వరకు ఏ ప్రొడ్యూసర్ కూడా ముందుకు రాలేదు. దీంతో శంకర్ -వేల్పరి- అంటూ మరో తలనొప్పిని నెత్తికి ఎత్తుకుంటున్నాడని కోలీవుడ్‌లో కామెంట్‌లు వినిపిస్తున్నాయి.



జాన్వీ కపూర్ ఆరాధన కంటే తక్కువ కాదు

## ముస్తాఫిజుర్ వివాదం: మా తప్పు తెలుసుకున్నాం.. భారత్‌తో ఫ్రెండ్లీ రిలేషన్స్ ముఖ్యం అంటున్న బంగ్లా




ఐపీఎల్ లో మా వాళ్లు ఆడరు.. ఐపీఎల్ ను మేము బహిష్కరిస్తున్నాం.. అంటూ బీరాలు పలికిన బంగ్లాదేశ్ పీచమణిగినట్లుంది. ముస్తాఫిజుర్ రెహమాన్ వివాదంతో భారత్ పై తీవ్ర నిందలు వేసి.. ఎట్టకేలకు గత్యంతరం లేక దిగొచ్చింది. మేము భారత్ తో ఫ్రెండ్లీ రిలేషన్స్ కోరుకుంటున్నాం అంటూ ప్రకటించింది. లేటెస్టుగా బంగ్లా స్పోర్ట్స్ మినిస్టర్ ఇండియాతో స్నేహపూర్వక సంబంధాలను కోరుకుంటున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. రానున్న రోజుల్లో ఇండియాతో సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

**ముస్తాఫిజుర్ వివాదం:**

బంగ్లాలో హిదువులపై దాడుల తర్వాత.. ఆ దేశానికి చెందిన ప్లేయర్లను ఐపీఎల్ నుంచి తొలగించాల్సిందిగా తీవ్ర ఒత్తిడి పెరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఖఖ= టీమ్ నుంచి బంగ్లా స్టార్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను రిలీజ్ చేసింది. వాస్తవానికి 2026 ఐపీఎల్ కోసం ముస్తాఫిజుర్ ను 9 కోట్ల రూపాయలకు కేకేఆర్ దక్కించుకుంది. కానీ దేశ ప్రజల నుంచి విమర్శలు, ఒత్తిడి కారణంగా రిలీజ్ చేయాల్సిందిగా బీసీసీఐ ఆదేశించింది. దీంతో కేకేఆర్ అతన్ని వదులుకుంది.

**ఐసీసీ షాక్:**


దీంతో బీసీసీఐ పై బంగ్లాదేశ్ తీవ్ర విమర్శలు చేసింది. ఇండియాలో ఐపీఎల్ లో మా ప్లేయర్లు ఆడరని ప్రకటించింది. అదే విధంగా టీ20 వరల్డ్ కప్ ను ఇండియా నుంచి శ్రీలంకకు తరలించాల్సిందిగా ఐసీసీని డిమాండ్ చేసింది. బంగ్లా ఒత్తిడికి తలొగ్గకుండా షెడ్యూల్ లో ఎలాంటి మార్పు చేయలేదు. అదే విధంగా టీర్నీ నుంచి బంగ్లా ఎలిమినేట్ కావాల్సి వచ్చింది. బంగ్లా ప్లేస్ లో స్కాట్లాండ్ ఆడింది.

వరుస పరిణామాలు బంగ్లాదేశ్ కు చెంపపెట్టుగా మారాయి. టీ20 టోర్నీ నుంచి నిష్క్రమణ, ఐసీసీ షాకివ్వడం తర్వాత.. క్రికెట్ విషయంలో మొదటికే మోసం

వచ్చేలా ఉందని బంగ్లాకు ఇన్నాళ్లకు తెలిసొచ్చింది. క్రికెట్ నుంచి వచ్చే ఆదాయం కూడా కోల్పోతే దేశం మరింత సంక్షోభంలోకి వెళ్తుందన్న భయాందోళనలతో కాబోలు.. ఇండియాతో స్నేహం కోరుకుంటున్నామని ఆ దేశ క్రీడా శాఖ మంత్రి ప్రకటించారు.


## కరన్ ప్లేస్ లో రాయల్స్ జట్టులోకి షనక!

శ్రీలంక టీ20 టీమ్ కెప్టెన్ దసున్ షనక ఐపీఎల్ 19వ సీజన్ ఆరంభానికి ముందు రాజస్తాన్ రాయల్స్ జట్టులో చేరనున్నాడు. గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమైన ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ స్థానంలో షనకను రాయల్స్ తమ జట్టులోకి తీసుకోనుంది. ప్రస్తుతం పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో లాహోర్ ఖలందర్స్ తరఫున ఆడుతున్న షనక త్వరలోనే గువాహటిలో రాయల్స్ జట్టుతో కలవనున్నాడు. ఇప్పటికే జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీ కేకేఆర్ కోసం పీఎస్ఎల్ ఒప్పందాన్ని రద్దు చేసుకోగా, ఇప్పుడు షనక కూడా అదే బాట పట్టడం ఆ లీగ్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. షనకకు సంబంధించిన పేపర్‌వర్క్ ప్రస్తుతం తుది దశలో ఉందని, అది పూర్తి కాగానే అతను ఇండియాకు చేరుకుంటాడని రాయల్స్ టీమ్ వర్గాలు తెలిపాయి.




## 60 ఏళ్లొచ్చినా ఆడతానేమో.. ధోనీ సరదా వ్యాఖ్యలతో హోరెత్తిన చెపాక్..

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజ ఆటగాడు, మిస్టర్ కూల్ ఎంఎస్ ధోనీ తన రిటైర్మెంట్‌పై మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేసి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ఐపీఎల్‌లో 60 ఏళ్ల వయసు వచ్చినా ఆడుతూనే ఉంటానేమోనంటూ ఆయన చేసిన సరదా వ్యాఖ్యలు చెపాక్ స్టేడియాన్ని హోరెత్తించాయి. ప్రస్తుతం 44 ఏళ్ల వయసులో ఉన్న ధోనీ, తన భవిష్యత్తు ప్రణాళికలపై జరుగుతున్న ఊహాగానాలకు ఈ వ్యాఖ్యలతో మరింత ఆసక్తిని జోడించారు.చెపాక్‌లో నిన్న జరిగిన సీఎస్‌కే ఫ్యాన్ ఈవెంట్‌లో ఈ సరదా సంభాషణ చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన నటుడు శివకార్తికేయన్, రిటైర్మెంట్ ఆలోచనలు పక్కనపెట్టి మరికొన్నేళ్లు సీఎస్‌కే పసుపు జెర్సీలో కొనసాగాలని ధోనీని కోరారు. దీనికి ధోనీ నవ్వుతూ బదులిస్తూ... “ప్రస్తుతం 44 ఏళ్ల వయసులో ఫిట్‌నెస్ కాపాడుకోవడం చాలా కష్టంగా ఉంది. అయినా కంగారు పడకండి... నేను 60 ఏళ్ల వరకు ఆడినా ఆశ్చర్యపోవద్దు” అని అన్నారు. ఈ మాటలకు స్టేడియంలోని అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.




వాస్తవానికి ఐపీఎల్ 2026 సీజన్ మొత్తానికి ధోనీ అందుబాటులో ఉంటాడని సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథన్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే, జట్టులో ఆయన పాత్ర క్రమంగా మారుతోంది. 2024 సీజన్‌కు ముందు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న ధోనీ, రుతురాజ్ గైక్వాడ్‌కు పగ్గాలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన ప్రధానంగా ఫినిషర్ పాత్రకే పరిమితమయ్యారు. ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన, జట్టులోకి సంజు శాంసన్ వంటి ఆటగాళ్లు రావడంతో భవిష్యత్తులో వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా పంచుకునే అవకాశం కనిపిస్తోంది.ఐపీఎల్ 2025 సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచి తీవ్రంగా నిరాశపరిచిన సీఎస్‌కేకు, ఈ దశలో ధోనీ అనుభవం ఎంతో కీలకం. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో జట్టును పునర్నిర్మించే క్రమంలో 2026 సీజన్ ఈ దిగ్గజ ఆటగాడికి ఘనమైన వీడ్కోలు పలికే చివరి అధ్యాయం కావొచ్చని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా ధోనీ క్రీజులో ఉన్నంత వరకు అభిమానులకు పండగే.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776